‘పరీక్షా పే చర్చ’కు గిన్నీస్ రికార్డు




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 5 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 218 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


శ్రీకృష్ణుడే మొదటి రాయబారి



2



# ఉద్యమాల సూరీడు శిబూ సోరెన్ కన్నుమూత

ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమ కర్త..
గిరిజన పోరాట యోధుడి మృతికి
కన్నీరు పెట్టిన ఝార్ఖండ్ ప్రజ 2

శిబును బీహార్ వాసులు
దిషోమ్ గురూజీగా కీర్తిస్తారు
మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన సోరెన్
కుమారుడు హేమంత్ ఝార్ఖండ్ సీఎంగా ఉన్నారు



రాష్ట్రపతి, ప్రధాని నివాళులు 2



# అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక

## అన్ని పార్టీలకూ చర్చించే అవకాశం ఇస్తాం

- అందరి అభిప్రాయంతోనే బాధ్యులపై చర్యలు
- ఇది రాజకీయ నివేదికో.. ప్రభుత్వ నివేదికో కాదు
- అవినీతి, ఆశ్రిత పక్షపాతంతోనే ప్రాజెక్టు నిర్మాణం
- కమిషన్ నివేదికలో రాజకీయ జోక్యం లేదు,
- ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడదు
- క్యాబినెట్ సమావేశం అనంతరం మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి
- పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 04, మనం బ్యూరో:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను త్వరలో శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలకు అభిప్రాయం చెప్పే అవకాశం ఇస్తామనీ, అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్న తరువాతనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన

...మిగతా 2లో

### కేసీఆర్ నిర్ణయాల మేరకే ప్రాజెక్టు నిర్మాణం: డిప్యూటీ సీఎం భట్టి

కేసీఆర్ సొంత నిర్ణయాల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మేం చెప్పే అంశాలు రాజకీయపరమైనవి కావనీ, ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను యథాతథంగా మీడియా సమావేశంలో వెల్లడిస్తున్నామని తెలిపారు. ప్రణాళిక నిర్మాణం, నిర్వహణలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రమేయం,

...మిగతా 2లో

### అవకతవకలకు కేసీఆర్, హరీష్ రావులే బాధ్యులు: ఉత్తమ్ కుమార్

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన మొత్తం అవకతవకలకు కేసీఆర్, హరీష్ రావులే బాధ్యులని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇష్టానుసారంగా ప్రాజెక్టు డిజైన్లు మార్చారనీ, ఈ విషయంలో సిడబ్ల్యుసి, ఎన్డీఎస్ఏ నివేదికలను సైతం పట్టించుకోలేదని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం కోసం రూ.84 వేల కోట్లు

...మిగతా 2లో

# ఆవిష్కరణల హబ్‌గా హైదరాబాద్

భారత దేశ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా మన రాజధాని
ప్రపంచంలోని ప్రతి 3 టీకాల్లో ఒకటి మనదగ్గర తయారైందే
ఎలీ లిల్లీ ఫార్మా ప్రారంభోత్సవంలో సీఎం

**హైదరాబాద్,ఆగస్టు 04, (మనం బ్యూరో):** హైదరాబాద్ నగరంలో టాలెంట్ ఉంది. లీడర్‌షిప్ ఉంది. విజన్ ఉంది. మంచి పాలసీ ఉంది. మౌలిక సదుపాయాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎలీ లిల్లీ వంటి గ్లోబల్ లీడర్‌కు హైదరాబాద్ అనుకూల కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. సోమవారం అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో చేసిన ప్రయత్నాల ఫలితంగానే హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి గ్లోబల్ రాజధానిగా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్-2047 దిశగా మేము వేసిన మరొక ముఖ్యమైన అడుగనీ, తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తెలంగాణపై నిరంతరం నమ్మకం ఉంచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నందుకు పారిశ్రామికవేత్తలకు ధన్యవాదాలనీ, ఎలీ లిల్లీ ఈ టెక్నాలజీ, ఇన్నోవేషన్, ప్రపంచవ్యాప్తంగా రోగుల సమస్యల పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక

...మిగతా 2లో

### భారీ వర్షాల నేపథ్యంలో..

కలెక్టర్లు, అన్ని శాఖల
అధికారులు అప్రమత్తంగా ఉండాలె
ప్రజలకు ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండ చూడాలె
సచివాలయం నుంచి సమీక్షలో సీఎం 2

పోరాట యోధుడు గురూజీ:
సోరెన్ మృతి పట్ల రేవంత్ సంతాపం

# రాష్ట్రపతితో భేటీ అందుకేనట

ప్రధాని, కేంద్ర హోంమంత్రి ముర్ముతో సమావేశమైంది జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ చర్చల కోసమేనంటున్న వార్తలు



**ఢిల్లీ, ఆగస్టు 4:** ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్లో సమావేశమైన సంగతి పాఠకులకు విదితమే. ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేండ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలైంది.బ్రిటన్, మాల్దీవుల

...మిగతా 2లో

బీజేపీని కారణంగా చూపుతూ

# ప్రభుత్వం తప్పించుకోవాలనుకుంటోంది

- బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష ప్రారంభంలో కవిత
- 42 శాతం రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలని డిమాండ్
- ముస్లింలకు అదనంగా 10 శాతం కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలన్న జాగృతి నేత

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేసింది. రిజర్వేషన్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం.. బీజేపీపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తోందని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కవిత 72 గంటల నిరాహార దీక్షను సోమవారం చేపట్టారు. దీక్షకు ముందు

...మిగతా 2లో



# అప్పటి వరకు శాంతి సాధ్యం కాదు

- భారత్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు మెరుగుపడే వరకు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సమస్య పోదు
- జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా



**కశ్మీర్, ఆగస్టు 4:** జమ్మూకశ్మీర్లో ఉగ్ర, వేర్పాటువాద కార్యకలాపాల విషయంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు మెరుగుపడేవరకు జమ్మూకశ్మీర్‌లో ఈ సమస్య పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. స్థానికంగా మిలిటెన్సీ అంతమైందనే వాదనలపై షోపియాన్ జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. ‘జమ్మూకశ్మీర్లో మిలిటెన్సీ ఇంకా అంతం కాలేదు. కాబోదు కూడా. పొరుగుదేశంతో సంబంధాలు మెరుగుపడేవరకు దీనికి పరిష్కారం దొరకదు. స్థానికంగా ఉగ్రస్థావరాలను నిర్మూలించామని కేంద్రం గతంలో ప్రకటించింది. మరి అటువంటప్పుడు ప్రస్తుతం కుల్గాం ఎన్కౌంటర్ ఎందుకు జరుగుతోంది? ఇటువంటి పరిస్థితుల్లో ఈ సమస్య లేదని ఎలా చెప్పగలరు?’’ అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. మిలిటెన్సీ ముగిసిందని తానెప్పుడూ చెప్పలేదన్నారు. జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దుకు మంగళవారంతో ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర హోదా ఎప్పుడు పునరుద్ధరిస్తారంటూ కేంద్రాన్ని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ఈ ఆరేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు.



## టీసీఎస్ ఎదుట ఫుట్‌పాత్‌పై నిద్రించి నిరసన

- వైరలవుతున్న ఉద్యోగి ఫోటోపై స్పందించిన ఐటీ సంస్థ

**హైదరాబాద్, ఆగస్టు 4:** ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆఫీస్ ఎదుట ఫుట్‌పాత్‌పై ఒక ఉద్యోగి నిద్రపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై టీసీఎస్ స్పందించింది. టీసీఎస్ కార్యాలయం బయట ఫుట్‌పాత్‌పై నిద్రించి నిరసన తెలపడానికి కొన్నినెలలుగా తనకు జీతం అందకపోవడమే కారణమని తెలిపిన టీసీఎస్ పుణే యూనిట్ ఉద్యోగి సౌరభ్ మోరె ‘నా దగ్గర డబ్బులేదు. టీసీఎస్ బయట ఫుట్పాత్పై పడుకోవాల్సి వస్తుందని నేను హెచ్ఆర్కు తెలియజేశాను. 2025 జులై 29న నేను సహ్యాద్రి ఐటీ క్యాంపస్లో రిపోర్ట్ చేశాను. కానీ ఐడీ యాక్టివ్ గా లేదు. కంపెనీ నా జీతాన్ని నిలిపివేసింది. దాంతో హెచ్ఆర్ వాళ్లను కలిస్తే.. నాకు రావాల్సిన మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పారు. కానీ అలా జరగలేదు’ అంటూ అందులో పేర్కొన్నాడు. దీనిపై టీసీఎస్ ప్రతినిధి

...మిగతా 2లో

## మరిన్ని ప్రతీకార సుంకాలు

భారత్‌పై పేలుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**హైదరాబాద్, ఆగస్టు 4:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవలే 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన

...మిగతా 2లో

# రాష్ట్రంలో కుండపోత

## భారీ వర్షంతో హైదరాబాద్ అతలాకుతలం

ఇల్లు దాటి బయటకు రావొద్దంటూ ప్రజలకు పోలీసుల హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 4:** తెలంగాణ వ్యాప్తంగా పలు చోట్ల సోమవారం కుండపోత వర్షం కురిసింది. హైదరాబాద్‌లో మాత్రం వర్షం బీభత్సం సృష్టించింది. ప్రకృతి తన ప్రతాపాన్ని చూపించింది. ఎన్నడూ లేనంతగా ఆకాశం నుంచి నీళ్లు కుమ్మరిస్తున్నట్లు.. మేఘాలకు చిల్లు పడినట్లు భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరం అతలాకుతలమైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మొదలైన ఈ వాన, నగరాన్ని అంధకారంలో ముంచేసింది. క్యూములోనింబస్ మేఘాలు ఆవరించడంతో.. పగటి పూట కూడా సాయంత్రం అయినట్లుగా వాతావరణం మారిపోయింది. జలపాతాల వద్ద ఎంత నీటిధార ఉంటుందో.. అంత ఎత్తున నీళ్లను ఆకాశం కుమ్మరించడంతో.. నగరంలోని వీధులన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్లన్నీ వాగులు, నదులను తలపించాయి. నగర శివార్ల నుంచి

...మిగతా 2లో

## ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు

**పాట్నా, ఆగస్టు 4:** ఆర్‌జేడీ నేత, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌పై పాట్నాలోని దిఘా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఆయనకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయంటూ న్యాయవాది రాజీవ్ రంజన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. శనివారం తేజస్వీ ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ తన పేరు సరికొత్త ఓటర్ల జాబితా నుంచి మాయమైందని ఆరోపించారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన ఎన్నికల అధికారులు జాబితాలను తెప్పించుకొని వెతికారు. బీహార్ యానిమల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్‌లోని పోలింగ్ బూత్ 204లో దానిని గుర్తించారు. జాబితాలో 416 నెంబర్లో తేజస్వీ వివరాలున్నాయని పేర్కొన్నారు. వాస్తవానికి అంతకు

...మిగతా 2లో

# 'పరీక్షా పే చర్చ'కు గిన్నీస్ రికార్డు

**ఢిల్లీ, ఆగస్టు 4:** పరీక్షలనగానే విద్యార్థుల్లో నెలకొనే భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం గిన్నిస్ వరల్ రికార్డు లో చోటు దక్కించుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా ఈ విశేషాన్ని షేర్ చేశారు. ఈ ఘనత తనకు వ్యక్తిగతంగానూ ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్వహించిన 8వ ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి నెల రోజుల్లోనే దాదాపు 3.53 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, 21 కోట్ల మందికి పైగా టీవీల్లో వీక్షించడంతో ఇది ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ చిరస్మరణీయ ఘనత సాధించిన వేళ మోడీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరికీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గిన్నిస్ వరల్ రికార్డ్స్ సిబ్బంది ఈ సర్టిఫికెట్‌ను అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద, పాఠశాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడే మొదటి రాయబారి

- వ్యాఖ్యానించిన సుప్రీం కోర్టు

**ఢిల్లీ, ఆగస్టు 4:** యూపీ ప్రభుత్వం, శ్రీ బాంకే బిహారీ టెంపుల్ ట్రస్ట్ వివాదం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రీకృష్ణుడే మొదటి రాయబారి అని.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలంటూ ఇరుపక్షాలకు సూచించింది. ఇందుకోసం ఒక కమిటీని ప్రతిపాదించింది. ఆలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో కారిడార్ ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తూ ఉత్తర్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విచారణ సందర్భంగా శ్రీకృష్ణుడి రాయబారం గురించి సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఆర్డినెన్సును ఆమోదించడంలో తొందర ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీని రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది.

# రాష్ట్రపతితో భేటీ అందుకేనట

(మొదటి పేజీ తరువాయి)

పర్యటన తర్వాత రాష్ట్రపతిని ప్రధాని మోడీ కలవడం ఇదే తొలిసారి. తర్వాత కొన్ని గంటలకు తర్వాత అమిత్ షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతితో సమావేశం అనంతరం హోంమంత్రి జమ్మూకశ్మీర్ నేతలను కలిశారు. దాంతో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా అన్న వార్తలకు బలం చేకూరుతోంది. జమ్మూకశ్మీర్కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ.. రాష్ట్రహోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం వరకు వర్షం దంచి కొట్టింది. ప్రధాన ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

**ఐటీ కారిడార్ అతలాకుతలం..**

ఐటీ కారిడార్‌లో వర్షం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకుపోయి నరకయాతన అనుభవించారు. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్ వంటి ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దూరంలో ఉన్న వాహనాలు, భవనాలు కూడా కనిపించనంతగా వర్షం పడింది. నాలాలు పొంగి ప్రవహించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే 100కు డయల్ చేయాలని పోలీసులు సూచించారు. ఇది క్లౌడ్ బరస్ట్ తరహా వర్షమని నగరవాసులు అభిప్రాయపడ్డారు.

**ఎవరూ బయటకు రావద్దు..**

పరిస్థితి తీవ్రతను గమనించిన హైదరాబాద్ సిటీ పోలీసులు వెంటనే ప్రజలకు అత్యవసర సూచనలు జారీ చేశారు. భారీ వర్షం కురుస్తుండటంతో ఇళ్లల్లో ఉన్నవాళ్లు బయటికి వెళ్లవద్దని సూచించారు. అదే విధంగా ఆఫీసుల్లో ఉన్న వాళ్లు వర్షం పూర్తిగా నిలిచే వరకు బయలుదేరవద్దని హెచ్చరించారు. భారీగా వరద పారుతుండటంతో రోడ్లపై వాహనాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని.. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వర్షం తగ్గిన తర్వాతే ప్రయాణం చేయాలని సూచించారు. నగరమంతటా ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు ఎక్కడ ఉన్నవారు అక్కడే సురక్షితంగా ఉండాలని కోరారు. ఏదైనా ప్రమాదానికి గురైతే.. తక్షణ సహాయం కోసం 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ అకాల వర్షం క్లౌడ్ బరస్ట్ తరహాలో ఉందని నగరవాసులు అభిప్రాయపడ్డారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో ఇలాంటి అనూహ్య వాతావరణ పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)



ముందు తేజస్వీ ఎన్నికల కమిషన్ను ఉద్దేశించి మాట్లాడుతూ అసలు తన పేరే ఓటర్ జాబితాలో లేదని సంచలన ప్రకటన చేశారు.బీహార్‌లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసిన రోజే ఎన్నికల కమిషన్ బీజేపీ కోసం ఓట్లను చోరీ చేసిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తేజస్వీ ప్రకటన రావడం గమనార్హం. దీనిపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ రాహుల్, తేజస్వీ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

# ఉద్యమాల సూరీడు శిబూ సోరెన్ కన్నుమూత

**ఢిల్లీ, ఆగస్టు 4:**ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ కన్నుమూశారు. గత కొద్ది కాలంగా ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో మూత్రపిండాల వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం బీహార్ లోని రామ్ గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. హేమంత్ సోరెన్ ప్రస్తుతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. దుర్గా సోరెన్ మృతి చెందారు. సంతాల్ కమ్యూనిటీకి చెందిన శిబు సోరెన్ వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోలతో కలిసి 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)ను ఏర్పాటు చేశారు. ఆ సంస్థతోనే ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో జాతీయ నేతగా ఎదిగారు. ఆయన పోరాట ఫలితంగా 2000లో ఝార్ఖండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, మూడు సార్లు సీఎం బాధ్యతలు చేపట్టినప్పటికీ ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. శిబూ సోరెన్ కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్ సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. శిబూ సోరెన్ భౌతికకాయాన్ని సాయంత్రం 4 గంటల సమయంలో రాంచీకి తరలించి, అనంతరం మొరాబాది ప్రాంతంలోని ఆయన నివాసానికి తీసుకెళ్తామని ఝార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ వెల్లడించారు.



**రాష్ట్రపతి, ప్రధాని నివాళులు**

రాష్ట్రపతి, ప్రధాని వేర్వేరుగా ఆస్పత్రిని సందర్శించి శిబూ సోరెన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు తమ సానుభూతిని వ్యక్తపరిచారు. గిరిజన, పేద, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు శిబూ సోరెన్ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు సోరెన్కు నివాళులర్పించారు.



**హేమంత్ ఉద్వేగం..**

'మన ప్రియనేత దిశోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది' అని శిబు సోరెన్ కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తన ఎక్స్ ఖాతాలో ఉద్వేగపూరితంగా ప్రకటించారు.

## పోరాట యోధుడు గురూజీ : సీఎం రేవంత్ సంతాపం

జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలో, గిరిజన సమస్యల పరిష్కారంలో మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన సీఎం వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ సోరెన్ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు సోరెన్ ఎప్పుడూ మద్దతు తెలిపేవారనీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన మద్దతుదారుగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదివాసీ సమాజానికి సోరెన్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచి పోతాయనీ, ఎనిమిదిసార్లు లోక్‌సభ సభ్యునిగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా, జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోరెన్ కుమారుడు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆయన కుటుం సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి సానుభూతి తెలిపారు.

## తెలంగాణ ఉద్యమంలో మా వెంట ఉన్నారు: కేసీఆర్ విచారం

జేఎంఎం అధినేత, ఝార్ఖండ్ మాజీ సీఎం శిబు సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ, ఝార్ఖండ్ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటు అని ఆయన అన్నారు. శిబూ సోరెన్ చేపట్టిన ఝార్ఖండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి అని చెప్పారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ స్థాపన సమయంలో హైదరాబాద్‌లో జరిగిన తొలి



సభకు మొదటి అతిథిగా ఆయనను ఆహ్వానించుకున్నామని కేసీఆర్ తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కూడా శిబూ సోరెన్ మద్దతుగా నిలిచారని, 2022లో ఝార్ఖండ్‌లో శిబు సోరెన్‌ను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నానని కేసీఆర్ తెలిపారు. శిబు సోరెన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుమారుడు, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**సోరెన్ మహోన్నత వ్యక్తి: కేటీఆర్**

గిరిజన హక్కులు, ప్రాంతీయ స్వయం నిర్ణయాధికారం కోసం సోరెన్ అవిశ్రాంతంగా పోరాడారని అన్నారు. ఆయన మరణం తనకు తీవ్ర బాధను కలిగించిందని చెప్పారు.

ఆయన మరణం న్యాయం, గౌరవం, గుర్తింపు పట్ల అచంచలమైన నిబద్ధతతో ఏర్పడిన ఒక శకానికి ముగింపు అని అన్నారు. తెలంగాణ ఉద్యమం అల్లకల్లోలంగా ఉన్న రోజుల్లో తమకు ఆయన తోడుగా నిలిచారని కేటీఆర్ తెలిపారు. సోరెన్ దార్శనిక విలువలు ఎప్పటికీ నిలిచి ఉంటాయని అన్నారు.



## టీసీఎస్ ఎదుట ఫుట్‌పాత్‌పై నిద్రించిన ఉద్యోగి

(మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ.. ఆ ఉద్యోగి చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరయ్యాడని, కంపెనీ నిబంధనలను అనుసరించి అతడి పేరోల్ నిలిపివేశామని టీసీఎస్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ''ప్రస్తుతం మా కార్యాలయంలో రిపోర్ట్ చేశాడు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థించాడు. ప్రస్తుతానికి అతడికి మేం వసతి కల్పిస్తున్నాం. తన సమస్యను పరిష్కరించుకునేందుకు మా మద్దతు అందిస్తున్నాం. అలాగే అతడు ఆఫీస్ బయటలేడు'' అని టీసీఎస్ ప్రతినిధి పేర్కొన్నారు.

# ప్రభుత్వం తప్పించుకోవాలనుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ అంబేద్కర్, పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో సగ భాగం బీసీలు ఉన్నారని... వాళ్లకు రాజకీయంగా సగ భాగం దక్కాలనే సంకల్పంతో తాము దీక్ష చేపట్టామని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్టు బీసీలకు న్యాయం చేయాలని కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడుతున్నామని.. కానీ ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని ఆమె అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ 72 గంటల నిరాహారదీక్ష ప్రారంభించడానికి ముందు ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో పూజలు నిర్వహించారు. ఆనంతరం తన అత్తమామలు దేవనపల్లి రాంకిషన్ రావు, నవలత, భర్త అనిల్ ఆశీర్వాదం తీసుకున్నారు. తెలంగాణలో సగ భాగం బీసీలు ఉన్నారని, వాళ్లకు రాజకీయంగా సగ భాగం దక్కాలనే సంకల్పంతో తాము దీక్ష చేపట్టామని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్టు బీసీలకు న్యాయం చేయాలని కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడుతున్నామని, కానీ.. ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని ఆమె అన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ లేవనెత్తిన అనుమానాలను సీఎం రేవంత్ నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి పంపి, తెలంగాణ ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఇదే సమయంలో ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇవ్వాలని అన్నారు. ముస్లింలను మినహాయించి కేవలం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్లింలను మినహాయించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం చెబితే అప్పుడు బీజేపీ ఎందుకు ఒప్పుకోదో తామూ చూస్తామని అన్నారు. రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ దిశగా కృషి చేయాలని సూచించారు.

**దీక్షాస్థలి నుంచి కార్యకర్తలను పోలీసులు ఖాళీ చేయించే ప్రయత్నం చేసిండ్రు?..**

ఇదిలాఉంటే, తెలంగాణ జాగృతి దీక్ష స్థలి వద్ద నుంచి నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని,తమ కార్యకర్తలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు భారీ వర్షం.. మరోవైపు దీక్ష స్థలి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని ఇది పోలీసులకు తగదని కవిత సూచించారు.

# మరిన్ని ప్రతీకార సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్లో పోస్టు చేశారు. 'రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్ పై సుంకాలను మరింత పెంచబోతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.



# ఆవిష్కరణల హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

పాత్ర పోషిస్తుందన్నారు. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడమంటే ఈ నగరం ఘనతను ప్రపంచానికి చాటి చెప్పినట్లేననీ, భారత దేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందన్నారు. 2000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయనీ, 200కు పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతీ 3 టీకాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారు కావడం గర్వకారణమనీ, ఇక్కడి జీనోమ్ వ్యాలీ, దేశంలోని అతి పెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధి సముదాయంగా నిలిచిందన్నారు. తెలంగాణను భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా మాత్రమే కాకుండా ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్‌వన్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. మనందరం కలిసి కొత్త ఆవిష్కరణలు చేద్దాం. ప్రజల జీవితాలను మారుద్దాం. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును పునర్నిర్వచిద్దామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

నివేదికపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ముందుగా సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికలోని అంశాలపై సహచర మంత్రులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఘోష్ కమిషన్ నివేదికను క్యాబినెట్ ఆమోదించిందని వెల్లడించారు. ఇది రాజకీయ పార్టీ నివేదికో.. ప్రభుత్వ నివేదికో కాదు. మాజీ న్యాయమూర్తి ఇచ్చిన నివేదిక అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఈ నివేదికను తప్పు పట్టడం సహజమేననీ, వారికి అనుకూలంగా ఉంటే ఒక రకంగా లేకుంటే మరో విధంగా మాట్లాడటం వారికి అలవాటేనని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదికలో రాజకీయ జోక్యం లేదనీ, ఇది ఇండిపెండెంట్ జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక అని పేర్కొన్నారు. నివేదిక సారాంశం, అందరి సూచనల ప్రకారమే చర్యలు ఉంటాయనీ, ఊరు మార్చి, పేరు మార్చి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం కూలిపోయిందని ఆరోపించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించిందన్నారు. అన్నారం, సుందిళ్ల, బ్యారేజ్‌లలో సైతం పగుళ్లు వచ్చాయనీ, రీ డిజైనింగ్ పేరుతో ప్రాజెక్టు నిర్మాణాన్ని మాజీ సీఎం కేసీఆర్ మార్చారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకే అపార అనుభవం ఉన్న ఘోష్ చైర్మన్‌గా జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్‌ను నియమించామన్నారు. కమిషన్‌ను ఏర్పాటు చేసిన 16 నెలల తరువాత జూలై 31న 665 పేజీల నివేదికను జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి అందించిందన్నారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడు నెలలకే కూలిపోయిందనీ, అవినీతికి పాల్పడినందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ నిర్ణయాల మేరకే ప్రాజెక్టు నిర్మాణం: డిప్యూటీ సీఎం భట్టి

కేసీఆర్ సొంత నిర్ణయాల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మేం చెప్పే అంశాలు రాజకీయపరమైనవి కావనీ, ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను యధాతథంగా మీడియా సమావేశంలో వెల్లడిస్తున్నామని తెలిపారు. ప్రణాళిక నిర్మాణం, నిర్వహణలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రమేయం, సూచలనే అక్రమానికి కారణమని కమిషన్ నివేదిక తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు భావన దశ నుంచి మూడు బ్యారేజీలు చేపట్టడం అప్పటి సీఎం ఏకైక నిర్ణయమన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం మూడు బ్యారేజీలు నిర్మించాలన్న నిర్ణయం ఆనాటి సీఎం, నీటిపారుదల శాఖ మంత్రుల ఏకైక నిర్ణయం తప్ప ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక నిర్ణయం కాదని ఘోష్ కమిషన్ స్పష్టంగా చెప్పిందన్నారు. నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ క్యాబినెట్ సబ్ కమిటీలో జరిగిన నిర్ణయం క్యాబినెట్లో ఆమోదం పొందిందని చెప్పడం సరైంది కాదనీ, క్యాబినెట్లో ఆమోదం జరుగలేదు. ఆయన కమిషన్‌కు తప్పుగా రిపోర్ట్ చేశారని కమిషన్ స్పష్టం చేసిందని తెలిపారు. తుమ్మిడిహట్టిలో నీటి లభ్యత లేదని చెప్పడం సరైంది కాదనీ, రాష్ట్ర జీవనాడిగా ఉద్దేశించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యక్తిగత నిర్ణయాలు, అనవసర రాజకీయ జోక్యం, సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక క్రమశిక్షణ లోపించడం కారణంగా ప్రజాధనాన్ని భారీగా వృధా చేసిందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## అవకతవకలకు కేసీఆర్, హరీష్ రావులే బాధ్యులు: మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన మొత్తం అవకతవకలకు కేసీఆర్, హరీష్ రావులే బాధ్యులని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇష్టానుసారంగా ప్రాజెక్టు డిజైన్లు మార్చారనీ, ఈ విషయంలో సిడబ్ల్యుసి, ఎన్డీఎస్ఏ నివేదికలను సైతం పట్టించుకోలేదని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం కోసం రూ.84 వేల కోట్లు అధిక వడ్డీలకు తీసుకొచ్చారనీ, అయినప్పటికీ లోపభూయిష్టంగా నిర్మించిన కారణంగా ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ చెప్పిందనీ, మేం అధికారంలోకి రాకముందే ఆ బ్యారేజీ కూలిపోయిందని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునాదుల్లోనే లోపాలున్నాయనీ, మేడిగడ్డ వద్ద ఈ ప్రాజెక్టును నిర్మించడం తప్పని సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ ఇచ్చిని నివేదికలను నాటి కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రాజెక్టులో చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ చేయడానికి మాత్రమే పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామనీ, ఆ నివేదికనే ప్రజల ముందు ఉంచుతున్నామని వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని కమిషన్ స్పష్టంగా పేర్కొందని వెల్లడించారు. కేసీఆర్ ఇష్టానుసారంగా ప్రాజెక్టును నిర్మించారనీ, ఐఏఎస్‌లు,ఇంజనీర్లు సైతం ఆయన ఆదేశాల మేరకే పని చేశారని తెలిపారు. నోట్‌ఫైల్‌పై సీఎం కేసీఆర్ క్యాబినెట్ సెక్రటరీ సంతకాలున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో...

**హైదరాబాద్, ఆగస్టు 04, ( మనం బ్యూరో):** రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలనీ, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న మూడు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున ఎక్కడా, ఆస్తి ప్రాణ నష్టం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండాలనీ, జీహెచ్‌ఎంసీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- కడ్తాల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా
- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ ఎంపీ రాములు



**కడ్తాల్, ఆగస్టు 4 ( మనం, న్యూస్ ) :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎంపీ రాములు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు దొనదుల మహేష్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తల్లోజు ఆచారి, పోతుగంటి రాములు హాజరయ్యారు. కడ్తాల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి, రాములు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరియు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఎన్నో అనేక హామీలను ఇచ్చిన తర్వాత వాటిలో భాగంగానే రాష్ట్ర బడుగు బలహీన వర్గాల ప్రజలకు మరియు దివ్యాంగులకు పెన్షన్లను పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పడం జరిగింది. వితంతువులకు వృద్ధులకు మరియు ఒంటరి మహిళలకు 2వేల నుండి 4వేలకు పెంచుతామని, అదేవిధంగా దివ్యాంగులకు 4వేల నుండి 6వేలకు పెంచుతామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 2500, ఆడపిల్లల పెళ్లిలకు తులం బంగారం, రైతు భరోసా ఎకరానికి 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ, తెలంగాణ ఉద్యమకారులకు 25000 పెన్షన్ ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అనేక హామీలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ దారులకు తక్షణమే పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ముంతాజ్ బేగం కు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో మాజీ జెడ్పిసి హరి ప్రసాద్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాన్యా నాయక్, రాష్ట్ర నాయకులు సాయిలాల్ నాయక్, భగీరత్, శంకర్ నాయక్, జిల్లా నాయకులు శ్రీశైలం గౌడ్, యాదగిరి, మండలం నాయకులు వెంకటేష్ యాదవ్, విక్రం, పొగాకు వెంకటేష్, రాములు, జంగం వెంకటేష్, మాజీ సర్పంచ్ సాయిలు, సాయిగౌడ్, నరేష్ గౌడ్, ప్రేమ్ నాయక్, పవన్ రెడ్డి, సందీప్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తా

- సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ గౌడ్



**తుర్కయంజాల్ ఆగస్టు 4( మనం న్యూస్ ):** ఆగస్టు రెండవ తేదీన మొయినాబాద్ లో జరిగిన రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలలో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన నాయకులకు జిల్లా కౌన్సిల్లో కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. విద్యార్థి యువజన సంఘాలలో క్రియాశీలకంగా పని చేస్తున్న పి. శివకుమార్ గౌడ్ ను సిపిఐ జిల్లా కార్యవర్గంలోకి తీసుకోవడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న కాటంరాజు ను మరియు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ ను సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం పనిచేస్తామని, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకై పోరాడుతామని, విద్యార్థి, యువజన ఉద్యోగుల హక్కుల సంరక్షణ కోసం పాటుపడతామని వారు అన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో యువతకు ప్రాధాన్యం ఇస్తూ బలమైన చోట్లలో పోటీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొయినాబాదులో జరిగిన రంగారెడ్డి జిల్లా 17వ మహాసభల లో ఆమోదించబడిన తీర్మానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బలమైన ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని వారు తెలిపారు. 23 మందితో ఏర్పడిన జిల్లా కార్యవర్గం, 65 మందితో ఏర్పడిన జిల్లా కౌన్సిల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ నాయకులకు చోటు దక్కడం పై రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు.

# చేవెళ్లలో డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం



**చేవెళ్ల, ఆగస్టు 4(మనం న్యూస్ ):** చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో చేవెళ్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య నూతనంగా ఏర్పాటు చేసిన డయాగ్నొస్టిక్ సెంటర్ ను చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమత వెంకట్ రెడ్డి, సర్పంచ్ మల్గారి మోహన్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్, శర్వలింగం, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల, కళాశాల హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి

## ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్




**చేవెళ్ల , ఆగస్టు 4(మనం న్యూస్):** ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ స్కూల్, బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు . ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిన నేటికీ కళాశాల ఎస్సీ బాలికల హాస్టల్ ను ప్రారంభించకుండా ఎస్సీ స్కూల్ బాలికల హాస్టల్ లో కళాశాల విద్యార్థులకు వసతి కల్పించాలని అన్నారు. కళాశాల హాస్టల్ ప్రారంభించని హాస్టల్ వార్డెన్ ను, ఏ ఎస్ డబ్ల్యూ ఓ వెంకట్ ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేస్తుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ నియోజకవర్గ అయినప్పటికీ ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్ కు సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు . నూతనంగా చేవెళ్ల మండల కేంద్రంలో నూతన లైబ్రరీ నిర్మిస్తున్నారు కానీ, ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్ భవనం ఎందుకు నిర్మించడం లేదని సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులను స్థానిక ప్రజాప్రతినిధులను ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది , వెంటనే ఎస్సీ కళాశాల హాస్టల్ భవనం నిర్మించాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల నాయకులు పవన్ కుమార్, రాము , రిషి తదితరులు పాల్గొన్నారు.

# గని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- గనుల వద్ద అంబులెన్స్ ఏర్పాటు చేయాలి
- సింగరేణి సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



**గోదావరిఖని, ఆగస్ట్ 04 (మనం న్యూస్):** భూగర్భ గనులలో రూఫ్, సైడ్ ప్రమాదాలపై కార్మికులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ కే వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు సోమవారం దృశ్య మాధ్యమం ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో రక్షణ, భద్రతపై డైరెక్టర్ అవగాహనా సమావేశం నిర్వహించారు. గనుల వద్ద అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, ఉద్యోగులు, కార్మికులు రక్షణ చర్యలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 జిఎం డి లలిత్ కుమార్, జిఎం సేఫ్టీ ఎస్ మధుసూదన్, ఏరియా సేఫ్టీ అధికారి సాయి ప్రసాద్, కార్పొరేట్ ఐఎస్ఓ %డు ప్రాంతీయ ఐఎస్ఓ బందాలు, అన్ని ఏరియాల జిఎంలు, ఏజెంట్లు, మేనేజర్లు, భద్రతా అధికారులు, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు, ఏరియా ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి విరాళం అందజేత



**చేవెళ్ల, ఆగస్టు 4(మనం న్యూస్ ):** ఆలయాల అభివృద్ధికి ముడిమ్యాల పిఏసిఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి సోమవారం విరాళం అందజేశారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణంకు రూ. 2లక్షల 1వేయి, అదేవిధంగా న్యాలట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అగాపే సంపూర్ణ సువార్త సంఘం చర్చి నిర్మాణానికి రూ. 1లక్ష 60వేలు విరాళంగా అందజేశారు. గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న గోనె ప్రతాప్ రెడ్డికి ఈ సందర్భంగా పలువురు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ న్యాలట గ్రామ అధ్యక్షులు వెంకటేష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అండగా పోలీస్ శాఖ



**ఆత్మకూరు (ఎస్) ఆగస్టు 04 (మనం న్యూస్):** మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో తల్లి లక్ష్మి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో, 15 రోజుల క్రితం తండ్రి రాములు రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో ఒంటరిగా మిగిలిన ఇద్దరు పిల్లలకు అండగా నిలిచేందుకు సూర్యాపేట జిల్లా పోలీస్ సోమవారం గట్టికల్లు గ్రామంలో పిల్లల నివాసాన్ని జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించి పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో బాగంగా పిల్లలకు నిత్యావసరాలు, పాఠ్య పుస్తకాలు, నగదు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల బారినపడి పిల్లలను, కుటుంబాలను ఒంటరి వాళ్ళను చేయొద్దు అని కోరారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసు శాఖ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు. పిల్లల యొక్క పరిస్తిని గమనించి స్నేహపూర్వక పోలీసు, పోలీసు ప్రజా భరోసా ద్వారా పోలీసు శాఖ తరపున సహకారం అందించాలని ఈరోజు గట్టికల్లు గ్రామానికి వచ్చామని అన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కుటుంబ పెద్దను, తల్లిదండ్రులను కోల్పోయి పిల్లలు ఈ పరిస్థితికి రావడం బాధాకరం అన్నారు. పిల్లలతో మాట్లాడుతూ బాగా చదివి పెద్ద ఆఫీస్ కావాలని ఆకాక్షించారు. పోలీసు శాఖ అనగానే సమాజంలో ఒక రకమైన భావన ఉండేది, ప్రస్తుతం పోలీసులు స్నేహపూర్వక పోలీసింగ్ తో ప్రజలకు చేరువైనారు. పోలీసు అనగానే కేసులు, కోర్టులు అనే భావన వీడాలి ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు అండగా ఉంటున్నాము, పోలీసులు మనకోసం ఉన్నారు మనవారు అనే సద్భావన కలిగాలి అని కోరారు. జిల్లా పోలీసు శాఖ తరపున పోలీసు ప్రజా బరోసా కార్యక్రమం ద్వారా పిల్లలకు నిత్యావసర వస్తువులు, పుస్తకాలు, ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది. పోలీసులు మంచి కార్యక్రమం చేసి పిల్లలకు అండగా నిలిచారు. ఇప్పటివరకు పిల్లలకు అండగా నిలిచిన స్థానిక ప్రజలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, స్వచ్ఛంద సంవస్థలకు ఎస్పి అభినందనలు తెలిపినారు. పిల్లలను చేరదీసి వారి పోషణ, అలపాలన చూస్తున్న అదే గ్రామానికి చెందిన ఆర్ టి సి. డ్రైవర్ రాచకొండ రమేష్, హేమలత దంపతులను ఎస్పి గారు ప్రత్యేకంగా అభిందంచి కృతజ్ఞతలు తెలిపినారు.ఈ కార్యక్రమం నందు సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఆత్మకూరు ఎస్ ఐ.శ్రీకాంత్, జిల్లా పోలీసు వెలిఫర్ ఎస్ఐ. సాయిరాం, సురేష్, స్థానిక ప్రజలు, యువత అన్నారు.

# మహిళను కాపాడిన లేక్ పోలీసులు




**కరీంనగర్, ఆగస్టు 4 ( మనం బ్యూరో):**కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన బోజనపల్లి స్వరూప(30) కుటుంబ సమస్యల కారణంగా, కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ లో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా, విధులు నిర్వహిస్తున్న రెగార్డు ఆమెను రక్షించారు. లేక్ ఔట్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్నపోలీస్ కానిస్టేబుల్ డి సారయ్య , రెగార్డు ఎం.ఎ. హాఫీజ్ బేగ్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆత్మహత్యాయత్నం చేయబోతున్న ఆమెను గుర్తించి, వెంటనే ఆమె దగ్గరికి వెళ్లి సముదాయించి, ఆ ప్రయత్నం నుంచి విరమింపజేశారు. అనంతరం ఆమెను సురక్షితంగా లేక్ పోలీస్ ఔట్ పోస్ట్ కు తరలించి, లేక్ ఎస్సై రమేష్ కౌన్సిలింగ్ నిర్వహించి, ఆమెను కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళను కాపాడిన పోలీస్ సిబ్బందిని ధైర్యసాహసాలను పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు

# పైపులైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

## నగర పాలక సంస్థ కమిషనర్ ప్రపుల్ దేశాయ్



**కరీంనగర్, ఆగస్టు 4 (మనం బ్యూరో):** అమత్ 2 లో చేపట్టిన త్రాగు నీటి సరఫరా పైపులైన్ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని కమీషనర్ ప్రపుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మంచి నీటి సరఫరా లో భాగంగా సోమవారం మానేరు డ్యాం సమీపంలోని నగరపాలక సంస్థ నీటి సుద్ధీకరణ కేంద్రాన్ని సందర్శించారు. నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఫిల్టర్ బెడ్ లోని నీటి శుద్దీకరణ విధానం, సంధులు, మోటారు పంపుల పనితీరును తనిఖీ చేసి పరిశీలించారు. నీటి శుద్దీకరణ ల్యాబ్ ను తనిఖీ నీటి పరిక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం శుద్దీ చేయబడిన నీటి నాణ్యతను పరిశీలించారు. బూస్చర్ల నుండి ఫిల్టర్ బెడ్లకు నీరు సరఫరా అవుతున్న తీరు డ్యాంలో నిటి మట్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి శుద్దీకరణ ప్రక్రియ తీస్కుంటున్న చర్యలు ఆలం కలిపే పద్దతి వివరాలను అడిగి తెలుసుకొని నీటి నాణ్యత, సరఫరా పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఫిల్టర్ బెడ్ లో జరుగుతున్న 10 ఎంఎల్ డి, 14 ఎంఎల్ డి మరమ్మతు పనులను కూడ తనిఖీ చేసి... పనుల వేగవంతం పై అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ నగర ప్రజలకు సమయానికి అనుగుణంగా త్రాగు నీటి సరఫరా చేయాలన్నారు. సరైన పద్దతిలో నీటిని శుద్ది చేసి నాణ్యత విషయంలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా చర్యలు తీస్కోవాలన్నారు. మోటారు పంపులు సక్రమంగా పని చేసేలా చూడాలని స్టాండ్ బై మోటారు పంపులను కూడ వినియోగించాలన్నారు. విద్యుత్ అంతరాయం జరుగుతున్నప్పుడు శుద్దీకరణ ప్రక్రియలో ఇబ్బందులు రాకుండా జనరేటర్లను వాడుకోవాలని ఆదేశించారు. అంతే కాకుండా 10,14 ఎంఎల్ డి ఫిల్టర్ బెడ్ మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అమత్ 2 పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేసి ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇస్తూ వివరాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పైపు లైన్ నిర్మాణం పూర్తైన వెంటనే సీసీ ప్యాచ్ వర్క్ పనులను కూజ పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులను ఎప్పటికప్పుడు పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ అధికారులు పర్యవేక్షణ చేయాలని ప్రతి గల్లీలో పైపులైన్ వేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. అమత్ 2 లో కొత్తగా విలీనం చెందిన గ్రామాలు లేకపోవడం పట్ల విచారణ వ్యక్తం చేశారు. ముఖ్యంగా బొమ్మకల్ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, దేవేందర్, పబ్లిక్ హెల్త్ డీఈ సంపత్ రావు, మిషన్ భగీరథ ఈఈ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ ప్రాపర్టీ లో వ్యాపారం చేయరాదు

- నగర పాలక సంస్థ కమీషనర్ ప్రపుల్ దేశాయ్....





**కరీంనగర్, ఆగస్టు4(మనం బ్యూరో):**నగరంలో రెసిడెన్షియల్ ప్రాపర్టిల్లో వ్యాపారం చేస్తుంటే అలాంటి ప్రాపర్టీలను గుర్తించి రెసిడెన్షియల్ నుండి కమర్షియల్ కు మార్చేలా అధికారులు చర్యలు తీస్కోవాలని కమీషనర్ ప్రపుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో గల కళాభారతి లో సోమవారం వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ, పారిశుధ్యం విభాగం అధికారులు, సిబ్బంది తో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆస్తిపన్నుల వసూళ్లు, రెసిడెన్షియల్ నుండి కమర్షియల్ మార్చే ప్రక్రియ, అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్, నగర పారిశుధ్యం, ఆనాథరైజ్డ్ కన్ స్ట్రక్షన్ ఇంటి నెంబర్ తొలగింపు, వార్డు కార్యాలయాల ద్వారా విధి నిర్వహణ చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా అధికారులు, సిబ్బంది తో చర్చించారు. సంబంధిత అంశాల పై సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ 66 డివిజన్ల లో వార్డు కార్యాలయాలు అన్ని వినియోగంలోకి రావాలని వార్డు కార్యాలయాల నుండే ఆఫీసర్లు విధినిర్వహణ చేయాలన్నారు. వార్డు కార్యాలయాల్లో ఎవరైన ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి వస్తువులను నిల్వ చేయకుండ చూడాలన్నారు. మీ డివిజన్ వారిగా ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయో గుర్తించి... వాటి వివరాలను రిజిస్టర్ లో పొందు పరచాలని అన్నారు. అంతే కాకుండా డివిజన్ వారిగా ప్రాపర్టి టాక్స్ కలెక్షన్ కు కూడ వార్డు ఆఫీసర్లు రిజిస్టర్ పాటించి...ప్రతి రోజు కలెక్షన్ వివరాలను నమోదు చేస్కోవాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు ప్రతి రోజు ఉదయం పారిశుధ్య పనులు పర్యవేక్షించి... అనంతరం ఫీల్డ్ లెవల్ లో ప్రాపర్టి టాక్స్ వసూలు చేయాలని అన్నారు. డివిజన్ వారిగా పారిశుధ్య పనులు మెరుగ్గా చేయాలని... కార్మీకుల హాజరు శాతం వార్డు ఆఫీసర్లే నమోదు చేయాలన్నారు. డివిజన్ వారిగా అన్ అసెస్, అండర్ అసెస్మెంట్ల పై ప్రత్యేక దష్టి పెట్టి... ఆక్టివిటి వివరాలను రిజిస్టర్ లో పొందుపరచాలని అన్నారు. ప్రతి ఇన్ స్పెక్టర్, జవానులు, వవార్డు ఆఫీసర్లు, కార్మీక సిబ్బంది అందరు ఫీల్డులో ఉండి పారిశుధ్య పనులు చేయాలని చెత్త పాయింట్ల వద్ద ఎక్కడ చెత్త కనబడకుండ శుభ్ర పరచాలన్నారు. ప్రతి రోజు స్వచ్ఛ్ ఆటోలను పర్యవేక్షణ చేస్తూ ఇంటింటికి స్వచ్ఛ్ ఆటో తిరిగి తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని జవాను పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఒక్క ఆటో చెత్త సేకరణ చేయక పోయినా జీపీఎస్ ట్రాక్ ద్వారా కనుగొని అలాంటి స్వచ్ఛ ఆటోల పై చర్యలు తీస్కుంటామని తెలిపారు. ప్రతి స్వచ్ఛ్ ఆటో ప్రభుత్వ డీఆర్ సీసీ కి వెల్లిన తర్వాతే డంపు యార్డుకు వెళ్లాలని రోడ్ల పై ఎక్కడ చెత్త డంపు చేసిన చర్యలు తప్పవని ఆదేశించారు. నగరంలో 9 వేల ట్రేడ్ లైసెన్స్ పూర్తి చేసేలా ఇన్ స్పెక్టర్లు చర్యలు తీస్కోవాలి... 9 వేల ట్రేడ్ లైసెన్స్ నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ చేయడంతో పాటు పన్నులు కూడ వసూలు చేయాలని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ బాధ్యత ఇన్ స్పెక్టర్లదే అన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఆస్తి పన్నులను టార్గెట్ ప్రకారం వసూలు చేసి... కలెక్షన్ వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఓపెన్ స్థలాల వారికి నోటీసులు జారీ చేసి ఖాళీ స్థలాలు శుభ్రం చేయించాలని కోరారు. విషజ్వరాల పట్ల పారిశుధ్య అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దోమల నివారణ చర్యలను డివిజన్ వారిగా చేపట్టాలని ఆదేశించారు. డివిజన్ వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలు ప్రతి రోజు జరగాలని అన్నారు. లార్వా ఆక్టివిటి లో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని అన్నారు. ప్రతి రోజు చెత్త పాయింట్లను శుభ్ర పరిచి పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా వార్డు ఆఫీసర్లు, జవాను చర్యలు తీసుకోవాలని అన్నారు. రెసిడెన్షియల్ నుండి కమర్షియల్ కు ప్రాపర్టిలను మార్చాలని టార్గెట్ ప్రకారం వాటిని పూర్తి చేయాలని అన్నారు. కమర్షియల్ షాపులలో కమర్షియల్ టాక్స్ వసూలు చేసి... ట్రేడ్ లైసెన్స్ కట్టించడం... లేకుంటే ఫెనాల్టీ వేయాలని కమీషనర్ అదికారులను ఆదేశించారు. అధికారులు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమీషనర్ సువార్త, డిప్యూటీ కమీషనర్లు వేణు మాధవ్, ఖాధర్ మోహియొద్దిన్, ఆర్వోలు, ఆర్ ఐలు, సానిటేషన్ సూపరవైజర్ల, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు, ఎస్సైలు, జవానులు పాల్గొన్నారు.

## దేవుని భూమిలో?!

మరణించే జీవులను ఖననం చేయడానికి
కాసింత నేలకోసం వెతుకుతుంటాం కదా
మరీ ఆ నేలనే మరణిస్తుంటే
మాట్లాడకుండా ఉంటారెం?

రోగాలు మనషులకే కాదు
ఆలోచనలకూ ఉంటాయి...
తాకితే సోకే అంటువ్యాధులకు మందున్నట్టే
మాటలతో పాకే విద్వేషపు రోగాలకు
మందుకనిపెడ్తే బాగుండు!

పిల్లలొస్తే వాళ్ళ కడుపునింపాలని
చూసే తల్లుల రొమ్ములు
పాలకోసం ఏడ్చి ఏడ్చి ఎండిన పెదాలు
పక్కపక్కనే పడి ఉన్న పిల్లల
పెదాలు, తల్లుల రొమ్ములు

దేవుడు,పవిత్ర క్షేత్రం
అంతా పాలకుల కట్టుకథలు
యుద్ధం మిగిల్చిన మరుభూమే సాక్ష్యం
దేవుని భూమిలో శవాల కుప్పలు,బూడిద
దిబ్బలే ఆనవాళ్ళు
అవి తో ముప్పని మొరిగే మనుషుల్లారా!
మారణహోమం జరుగుతున్న స్పందించని
మీతోనే ముప్పు
రోబోలకన్నా మానవత్వం సచ్చిన మనుషులే
ప్రమాదకారులు!!

**- దిలీప్. వి**
8464030808

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# మోడీ... ఆరెస్సెస్ మధ్య అంతరం పెరుగుతోందా?

బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధం భారత రాజకీయంలో అత్యంత ఆసక్తికరమైన, శక్తివంత మైన సంబంధాల్లో ఒకటి. జనసంఘం కాలం నాటికే ఆరంభమైన ఈ అనుబంధం, భారతీయ జనతా పార్టీ స్థాపన తర్వాత మరింత బల పడింది. ఆరెస్సెస్లో సేద్యం చేసిన కర్షకులు, పౌర అభ్యుదయమే లక్ష్యంగా భావించే స్వయం సేవకులు, బీజేపీలో కీలక స్థానాల్లోకి వచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం స్పష్టంగా కనిపించేది. కానీ, నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానిగా పదవిలోకి వచ్చిన తర్వాత ఆయన పాలనా శైలి, ఆరెస్సెస్ భావజాలం మధ్య తేడాలు కనబడు తున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్, సిద్ధాంతపరంగా నూతన భారత నిర్మాణంలో 'సంస్కార' ప్రాతిపదికగా సామాజిక మార్పు, హిందుత్వ విలువల ప్రచారం ద్వారా జాతి నిర్మాణాన్ని కోరుతుంది. కానీ మోదీ పాలన నిత్య రాజకీయ దృష్టితో ముందుకు సాగుతున్నది. ఆయన నూతన భారత నిర్మాణంలో సామాజిక పరిమాణాల కన్నా రాజకీయ విజయమే ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా ప్రజల మద్దతుతో కూడిన శక్తిమంతమైన నరేంద్ర మోదీ బ్రాండ్ నిర్మాణం, నిత్యం ఎన్నికల మూడ్, మెగా స్కీమ్‌లు, హిందూ ఓటు బ్యాంకు సమీకరణం వంటి అంశాలు గణనీయంగా మారాయి. ఈ క్రమంలో బీజేపీ కార్యనిర్వాహక నియంత్రణ ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో ఉండకుండా, ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ కేంద్రీకృతమవుతోంది. నరేంద్ర మోదీ నియామకాలు, భవిష్యత్ రాజకీయ వారసత్వంపై తనదైన శైలి ప్రవేశ పెడుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.

ఇటీవలి మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆర్‌ఎస్‌ఎస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాక, బిఎల్ సంతోష్ వంటి సంఘ ప్రచారకులు ఇప్పటికే పార్టీ పొలిటికల్ కంట్రోల్ నుంచి పక్కకు నెట్టబడ్డారని వాదనలు వచ్చాయి. దీంతో, ఆర్‌ఎస్‌ఎస్ మౌనం తప్ప మరో ప్రకటన




**మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆర్‌ఎస్‌ఎస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది.**
**బీజేపీ - ఆర్‌ఎస్‌ఎస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు.**

చేయలేదు.

ఇక ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలపై కేంద్రం దృష్టి మరిచిందని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్కృత భాషా అభివృద్ధి, ధర్మాచార్య వ్యవస్థకు ప్రోత్సాహం, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యా సంస్థలకు నిధుల అనుకూలత వంటి రంగాల్లో మోదీ హయాంలో అనేక ఆశలున్నప్పటికీ, వాటి అమలులో చురుకుదనం తగ్గిందని సంఘ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాక, నూతన విద్యా విధానం, యూనిఫాం సివిల్ కోడ్, జనాభా నియంత్రణపై చట్టాలు వంటి హిందుత్వ సంబంధిత ముఖ్య రంగాల్లో తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంతో, ఆరెస్సెస్‌లో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయం వ్యాపక మవుతోంది.

ఈ నేపథ్యంలో, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు గమనించదగ్గవే. రాజకీయ నాయకులు వయసు 75 దాటిన తరువాత పదవులు వదిలి పోవాలని, తద్వారా యువతకు అవకాశం కల్పించ బడాలని ప్రకటించారు. ప్రధాని మోదీ కూడా 75కి చేరుతున్నందువల్ల, ఇది ప్రత్యక్ష సంకేతమా అనేదీ విమర్శలు ఉన్నాయి.

ఆయన్ని స్వయంగా మోదీ కలవక పోవడం, బీజేపీ అగ్రనేతలు కోపతాపాలకు లోనై, స్పందించక పోవడం అన్నీ రాజకీయ విశ్లేషకుల దృష్టికి వచ్చాయి. 'ఆసక్తికరమైన సమాజం కోసం రాజకీయాలు మారాలి', 'దేశ భవిష్యత్ కోసం మత సామరస్యమే మార్గం', 'నిర్బంధం కాదు, నైతికతే ముఖ్యమని' భాగవత్ పలుమార్లు చెప్పడం ద్వారా మోదీ పాలనను వ్యంగ్యంగా విమర్శించినట్టు భావన కలుగుతోంది. మోదీ కేంద్రీకృత పాలన విధానం, మంత్రివర్గ వ్యవహార శైలి, ఆయా రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రుల ఎంపికలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర తగ్గిపోవడం వంటి అంశాలు ఈ విభిధాంతరాన్ని మరింత స్పష్టంగా చేస్తున్నాయి.

అయితే ఇది పూర్తిగా విభేదం కాదు. మోదీ-ఆర్‌ఎస్‌ఎస్ మధ్య సంబంధం మౌలికంగా ఒకే భావజాలపు పునాది మీద నడుస్తున్నా, దాని కార్యరూపాలు, ప్రామాణికతల్లో తేడాలు రావడం సహజం.

ప్రధానిగా మోదీ రాజకీయ అవసరాల దృష్టితో నిర్ణయాలు తీసుకుంటే, ఆర్‌ఎస్‌ఎస్ దాన్ని ధర్మ, సంస్కృతి, సంయమనం అనే పరిమాణాలతో పరిశీలిస్తుంది. అందువల్ల, ఈ అంతరం వాస్తవమే అయినా, అది శాశ్వత శత్రుత్వానికి దారితీయదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

భాజపా - ఆర్‌ఎస్‌ఎస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు. మోదీ తర్వాత బీజేపీ - సంఘ పరస్పర సంబంధాలు ఎటు పోతాయన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలుస్తోంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# అమెరికా ప్రతిష్టను మసకబార్చుతున్న 'ట్రంప్ టారీఫ్ వార్'



అమెరికా డోనాల్డ్‌ట్రంప్ ఆధిపత్య ఆరాటంతో దాదాపు 70 దేశాల దిగువతులపై అధిక సుంకాలు విధిస్తున్నట్లు రోజుకో ప్రకటన చేస్తూ, మతి భ్రమించినట్లు అవాకులు చెవాకులు విసురుతున్నారు. అమెరికా చేపట్టే ప్రతి చర్య తన స్వార్థపూరిత ధోరణిని రుజువు చేస్తున్నది. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు, మీ ఇంటికి వస్తే ఏం పెడతావు అన్న చందంగా ఉన్నది నేటి అమెరికా డొనాల్ ట్రంప్ ప్రవర్తన. ఇతర దేశాల నుంచి జరిగే దిగుమతులకు ఆ దేశం విధించే పన్నులను టారీఫ్స్ లేదా సుంకాలుగా పేర్కొంటారు. విదేశీ వస్తువులు అమెరికాలో ప్రవేశించడానికి ఆ దేశం విధించే పన్నుల శాతాన్ని బట్టి ఇరుదేశాల మధ్య వస్తు వాణిజ్యాలు జరుగుతాయి. ఒక దేశ దిగుమతులపై 10 శాతం పన్ను విధించిన సందర్భంలో ప్రతి 10డాలర్లకు 1 డాలర్ పన్నును దిగుమతి చేసుకున్న కంపెనీ లేదా సంస్థ కట్టాల్సి ఉండడంతో ఆ వస్తువుకు ధర 11 డాలర్లుగా నిర్ణయించడం జరుగుతుంది.

**నిస్సహాయంగా నిలుస్తున్న ఐరాస, డబ్ల్యూటిఓ**

డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ఆయన మాటలు, కదలికలు, నిర్ణయాలు తీవ్ర సంచనాలుగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉంటు న్నాయి. నేడు అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధం లేదా టారీఫ్ వార్ ప్రారంభం ఒక అమెరికా విమోచన దినం లేదా లిబరేషన్ డే అంటూ 100 రోజుల ట్రంప్ పాలన సందర్భంగా ఏవేవో ప్రకటనలు చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ లేదా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటిఓ)ను నామమాత్రపు సంస్థగా కొట్టి పారేస్తూ, అంతర్జాతీయంగా పరువు తీసుకుంటున్నారు. ప్రపంచ వాణిజ్య అడ్డంకులను అధిగమిస్తూ ఎగుమతులు-దిగుమతులకు ఊతం ఇస్తూ, సుస్థిర అంతర్జాత వాణిజ్య విపణి స్వేచ్ఛను పరిరక్షించాలనే సదుద్దేశంతో 1995లో వరల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయబడింది. ఇటీవల జెనీవాలో జరిగిన డబ్యూటిఓ 30వ సమావేశం జరగడం, అంతర్జాతీయ వాణిజ్య అంశా లను చర్చించడం జరిగిన విషయం మనకు తెలుసు. డబ్ల్యూటిఓ సంస్థ చైనా పక్షపాతిగా పని చేస్తున్నదని ట్రంప్ మాట్లాడుతు న్నారు. నేడు కొనసాగుతున్న ఇజ్రాయిల్-గాజా యుద్ధం, ఉక్రె యిన్-రష్యా భీకర పోరాటం నేపథ్యంలో ఐక్యరాజ్యసమితితో పా టు ప్రపంచ వాణిజ్య సంస్థ కూడా నామమాత్రంగా, క్రియా శీలత కొరవడిన పేపర్ టైగర్స్ వలె నిస్సహాయంగా నిలుస్తున్నాయి.

**విమర్శలకు దారితీస్తున్న ట్రంప్ సుంకాలు**

అమెరికా డిక్షనరీలో అత్యంత ఇష్టమైన పదం సుంకం లేదా టారీఫ్ అంటున్నారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. పలు దేశాల దిగుమతులపై 10 శాతం సుంకాలు విధించడమే కాకుండా ఇండియా లాంటి దేశాలపై రెసిప్రోకల్ టారీఫ్ లేదా పరస్పర సహకార సుంకాలు విధిస్తున్నది. రష్యా నుంచి రక్షణ సామాగ్రి, ముడి చమురులతో పాటు ఇతర దిగుమతులు చేసుకోవడాన్ని ఆపి వేయాలని అమెరికా ఇండియాకు సూచిస్తూ, వినని యెడల రిసిప్రోకల్ టారీఫ్స్ విధిస్తామని బెదిరిస్తున్నారు. అమెరికాను సంపన్న దేశంగా తిరిగి నిలుపుతా అంటూ వివిధ దేశాలపై సుంకాల కత్తులు దూస్తున్నారు.

తాజాగా ఇండియా దిగుమ తులపై 25 శాతం రెసిప్రోకల్ టారీఫ్ విధించినట్లు ట్రంప్ ప్రకటన చేయడంతో పాటు పాకిస్థాన్ దిగుమతులపై గతంలో విధించిన 29 శాతం సుంకాన్ని 19 శాతం వరకు తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా 01 ఆగస్టు 2025 నుంచి హాటెస్ట్ కంట్రీలు అయిన కెనడాపై 35 శాతం, బ్రెజ్లి 50 శాతం, స్విట్జర్లాండ్‌పై 39 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు.



ట్రంపునకు ఇష్టమైన నినాదంగా సుంకాలతో అమెరికాను అత్యున్నత, సంపన్న దేశంగా నిలుపుతానంటూ ప్రకటనలు కుమ్మరిస్తున్నారు. ఇతర దేశాల రక్తాన్ని పీల్చి తాను సంపన్న దేశంగా నిలవాలని అమెరికా కలలు కంటున్నది. అగ్రరాజ్యం పోకడలు అడుక్కుతినే బిచ్చగాళ్ల వలె, సుంకాల హెచ్చరికల రూపంలో దేశాలను తన ఆదీనంలోకి తెచ్చుకునే చావు తెలివిని ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తున్నది. తాను చేస్తున్న సుంకాల యుద్ధంతో అమెరికాలో ఉత్పత్తుల పెరుగుదల, ఉద్యోగ కల్పన, వాణిజ్య లోటు భర్తీ, పెట్టుబడులు పెంచుకోవడానికి ఉపయుక్తం గా ఉంటాయంటా ట్రంప్ అతి గర్వంగా ప్రకటనలు కుమ్మరి స్తున్నారు. సంపన్న అగ్రరాజ్యంగా అమెరికా నిత్యం స్వార్థమే పరమావధిగా పావులు కదపడం కొత్తేమీ కాదు. అమెరికా తీసు కునే ప్రతి నిర్ణయం తనకు విజయాన్ని, పరాయి దేశానికి నష్టాన్ని కలిగించే విధంగా విన్-లూజ్ (యూఎస్ విజయం - పొరుగు దేశ అపజయం) మంత్రాన్ని జపిస్తున్నది. ఒక అగ్రరాజ్యంగా లోక కళ్యాణానికి ఉపయుక్తంగా విన్-విన్ (అమెరికాకులాభం- పొరు గు దేశానికి లాభం)పరిస్థితులను కల్పించాల్సి ఉన్న తరుణంలో విన్ - లూజ్ నిర్ణయాలను అతి తెలివిగా ప్రయోగిస్తున్నది.

**అసమ్మతిని మూట కట్టుకున్న ట్రంప్**

అమెరికా నేడు అన్ని దేశాలను వినియోగదారుడిగా వ్యాపార దృష్టితో చూస్తున్నది. తన ప్రయోజనాలే ఊపిరిగా, అల్పాదాయ దేశాల నుంచి సహితం లాభం పొందడానికి సిద్ధంగా ఉన్నది. ప్రపంచ దేశాల నుంచి రక్తాన్ని పీల్చే జలగ వలె అమెరికా అవతరించింది. అంతర్జాతీయ విపణిలో చులకనై పోతున్నది. మానవత్వాన్ని, ప్రపంచ శాంతిని మరిచి తన లాభమే బ్రహ్మసూత్రంగా పావులు కదుపుతున్నది. ట్రంప్ ప్రకటించిన సుంకాల అస్త్రం తనకే కీడును చేయనుందని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన ప్రపంచ ప్రజాదరణ కలిగిన నాయకుల జాబితాలో ట్రంప్ 8వ స్థానంలో నిలుస్తూ, 50 శాతం ప్రజల అసమ్మతిని మూటగట్టుకున్నారు. ఒకవేళ నేడు అమెరికాలో ఎన్నికలే జరిగితే ట్రంప్ ఓటమి ఖాయమని తెలుస్తున్నది. నేడు అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధంతో ప్రపంచ దేశాలన్నీ వ్యతిరేకం కావడం, అమెరికాను ఏకాకిని చేయడం జరిగే అవకాశాలు కూడా లేకపోలేదని నమ్మే ప్రజల సంఖ్య పెరుగుతోంది.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## జ్వలించే నిరంతరస్ఫూర్తి...

అదిగో అక్కడ వెలుగులీనుతున్న అమరజ్యోతి
దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వీరత్వం
సైన్యమై శత్రువుల గుండెల్లో పేలిన మందుపాతర
ధైర్యం శౌర్యం వీరత్వం
మూర్తీభవించిన భారతీయం
తల్లిదండ్రులు భార్యాపిల్లలకి
పలికిన ఆఖరి వీడ్కోలు
స్వర్గరథం వెంట కదులుతున్న దుఃఖం, అర్ధాంగి
నాన్నెందుకు మాటాడడం లేదో ! అర్థంకాని
చిన్నారులు ..అందరి పరామర్శకి జవాబు
చెబుతున్న వేదన - తల్లిదండ్రులు
తోడుగా వీరునికి జన్మనిచ్చిన నేల,
వీరునికి పలుకుతున్న చివరి వీడ్కోలు...
బాధని గుండె దిగమింగుకుంటోంది.. కనులు
వర్షిస్తూనే వున్నాయి..'జోహార్' అంటూ
చల్లుతున్న పూలు.. కన్నీళ్లను తుడిచి
వేస్తున్నాయి.. 'అమర్ రహే' అంటూ నినదిస్తున్న
గొంతులు .. అందరి మనసులని
తడిపేస్తున్నాయి... అదిగో, జాతీయపతాకం
కప్పబడినచోట .. ఒక గెలుపుసంజ్ఞ ..
నింగికెగిసిన వెలుగు జ్వలించే నిరంతరస్ఫూర్తి...
ఈ నేల రుణం తీర్చుకున్న ఒక అంతులేని
తృప్తి... వీరుని త్యాగం జాతి గుండెల్లో నిలుచు
చిరస్థాయి.. అందరూ క్షేమమై నడయాడుతున్న
నేలపై .. ఆ త్యాగమూర్తి పాదముద్రలు
శాశ్వతం... అమరం...

**- అశోక్ గుంటుక**
9908144099

# పులుల సంరక్షణ : దేశం సాధించిన ప్రగతి!



ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత సురక్షితమైన పులుల ఆవాసాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. గత కొన్ని దశాబ్దాలుగా మన దేశం సాధించిన పురోగతి నిజంగా అద్భుతం, ఇది ప్రపంచవ్యాప్తంగా సంరక్షకులకు ఆదర్శంగా నిలుస్తుంది. 2006లో కేవలం 1,411 పులులు మాత్రమే అడవులలో నివసిస్తున్నాయని అంచనా వేయగా, ఈ సంఖ్య 2010లో 1,706కు, 2014లో 2,226కు (30.5% పెరుగు దల), 2018లో 2,967కు గణనీయంగా పెరిగింది. అద్భుత మైన రీతిలో 2023 సం. నాటికి ఏకంగా 3,682 పులులతో భారతదేశం ప్రపంచ పులుల జనాభాలో దాదాపు 75 శాతాన్ని తనదైందని ప్రకటించింది. ఇది కేవలం సంఖ్యల పెరుగుదల మాత్రమే కాదు, దేశం పులుల సంరక్షణకు ఎంత అంకిత భావంతో, నిరంతరం శ్రమిస్తుందో తెలియజేస్తుంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు అటవీ ప్రాంతాలలో ట్రెక్కింగ్ చేస్తూ, అటవీ అధికారులు శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి ఈ జనాభా గణనను చేపడతారు. ఈ సుదీర్ఘమైన, సవాళ్లతో కూడుకున్న పనికి మనం అభినందనలు తెలపాలి. ఈ గణనలో పులుల పాదముద్రలు, అత్యాధునిక కెమెరాట్రాప్‌లు, డీఎన్ఏ విశ్లేషణ వంటి ఆధునిక పద్ధతులను సమర్థవంతంగా ఉప యోగిస్తారు, ఇది కచ్చితమైన అంచనాలకు దారితీస్తుంది. పులుల సంఖ్య పెరుగుదల మన పర్యావరణ వ్యవస్థల అద్భుతమైన ఆరోగ్యాన్ని సూచిస్తుంది. పులులు ఆహార గొలుసులో అత్యున్నత స్థానంలో ఉన్నందున అవి ఆరోగ్యకరమైన మరియు సమతుల్యమైన అటవీ పర్యావరణానికి సూచికలుగా పనిచేస్తాయి. వాటి సంఖ్య పెరగడం అంటే అడవులు పచ్చగా ఉన్నాయని, వాటి ఆహార వనరులు సమృద్ధిగా ఉన్నాయని, తద్వారా మొత్తం జీవవైవిధ్యం అభివృద్ధి చెందుతుందని అర్థం. ఇది పర్యావరణ సమతుల్యతకు, ప్రకృతికి ఎంతగానో దోహద పడుతుంది.

**ప్రాజెక్ట్ టైగర్- ఒక మహత్తర విజయం**

పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ఘనతకు ప్రధాన కారణం నిస్సందేహంగా ప్రాజెక్ట్ టైగర్. పర్యావరణ, అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం పులుల సంరక్షణ బాధ్యతను పంచుకుంటున్న రాష్ట్రాలకు నిరంతరం కేంద్ర సహాయాన్ని అందిస్తుంది. 1973లో ప్రారంభమైన ప్రాజెక్ట్ టైగర్ కింద, పులుల ఆవాసాలను పరిరక్షించడానికి ప్రత్యేకమైన టైగర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని భారత ప్రభుత్వ జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఈ రిజర్వ్‌లు జాతీయ ఉద్యానవనం లేదా వన్యప్రాణుల అభయారణ్యం వంటి ఇప్పటికే ఉన్న రక్షిత ప్రాంతాలలో భాగమైన కీలకమైన ప్రాంతాలను కలిగి ఉంటాయి. ఇవి పులులకు అత్యంత అనుకూలమైన ఆవాసాలను అందిస్తాయి.

ప్రారంభంలో కేవలం 9 టైగర్ రిజర్వ్‌లతో మొదలై, మార్చి 2024 నాటికి ఈ సంఖ్య 55కు చేరగా, 2025 నాటికి ఏకంగా 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నట్లు సమాచారం. వీటిలో మాధవ్ టైగర్ రిజర్వ్ తాజాది. ఈరిజర్వ్‌లు అంతరించి పోతున్న బెంగాల్ టైగర్ను దాని సహజ ఆవాసాలను రక్షించడానికి ప్రత్యేకంగా స్థాపించబడ్డాయి. ఇవి మన పులుల పరిధిలోని 18 రాష్ట్రాలలో విస్తరించి, మొత్తం 78,735.5966 చ.కి.మీ (దేశభౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 2.23%) విస్తీర్ణంలో పులులకు సురక్షితమైన ఆవాసాన్ని అందిస్తున్నాయి. ఈ టైగర్ రిజర్వ్‌లు కఠినమైన నిఘా, అధునాతన వేట నిరోధక చర్యలు, స్థానిక ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో పులులకు అభేద్యమైన రక్షణ కల్పిస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, తెలంగాణలో అమ్రాబాద్ (2,611.39 చ.కి.మీ), కవాల్ (2,015.44చ.కి.మీ) టైగర్ రిజర్వ్‌లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ శ్రీశైలం (3,296.31 చ.కి.మీ) టైగర్ రిజర్వ్ ఉంది. ఈ రిజర్వ్‌లు కేవలం పులులను మాత్రమే కాకుండా వాటి జీవవైవిధ్యాన్ని కూడా కాపాడుతున్నాయి. వివిధ రకాల వృక్ష, జంతు జాతులకు సురక్షితమైన ఆశ్రయం కల్పిస్తున్నాయి.

**పర్యావరణ పర్యాటకం - సంరక్షణకు ఒక వంతెన**

మన దేశంలోని పులుల సంరక్షణ కేంద్రాలలో పర్యావరణ పర్యాటకం ఒక ముఖ్యమైన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోంది.



పర్యావరణ అవగాహన లక్ష్యంతో బాధ్యతాయుతమైన పర్యాటక పద్ధతులను అవలంబిస్తూ జీవవైవిధ్య పరిరక్షణను ఇది సమన్వయం చేస్తుంది.

రణతంబోర్, జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ వంటి ప్రసిద్ధ పులుల సంరక్షణ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రకృతి ఔత్సాహికులను, వన్యప్రాణుల ప్రేమికులను విరివిగా ఆకర్షిస్తున్నాయి. పర్యావరణ పర్యాటకం నుండి వచ్చే ఆదాయం సంరక్షణ ప్రయత్నాలకు గణనీయంగా దోహదపడుతుంది. దేశ పర్యావరణ సమతుల్యతలో జీవుల ప్రాముఖ్యతను బలోపేతం చేస్తుంది.

పర్యాటకం టైగర్ రిజర్వ్‌లలో గొప్ప జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో బాధ్యతను, భాగస్వామ్య నిబద్ధతను పెంపొందిస్తుంది. పర్యాటకులు పులులను వాటి సహజ ఆవాసాలలో ప్రత్యక్షంగా చూడటం ద్వారా వాటి సంరక్షణకు ఉన్న ఆవశ్యకతను మరింత లోతుగా అర్థం చేసుకుంటారు. ఇది ప్రజలలో వన్యప్రాణుల పట్ల అవగాహన, ప్రేమను గణనీయంగా పెంచుతుంది. సహజ ఆవాసాలకు కనీస అంతరాయం కలగకుండా, హాని కలిగించే పులుల జనాభాను కాపాడేందుకు కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి.

**ఉక్కుపాదం మోపాలి**

టైగర్ రిజర్వ్‌లకు వన్యప్రాణుల (రక్షణ) చట్టం 1972 ప్రకారం పటిష్టమైన చట్టపరమైన రక్షణ కల్పించబడింది. ఈ చట్టం అధికారులకు వేట, అక్రమ ఆక్రమణలు, రిజర్వ్ వన్యప్రాణులు, పర్యావరణ వ్యవస్థను బెదిరించే ఇతర కార్యకలాపాలపై కఠినమైన చర్యలు తీసుకునే అధికారం ఇస్తుంది. ఈ చట్టం లోని సెక్షన్ 38 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పులుల సంరక్షణ ప్రణాళికను రూపొందించే అమలు చేసే బాధ్యతను కలిగి ఉంటాయి. జీవవైవిధ్యాన్ని కాపాడే క్రమంలో పులులను సంరక్షించుకోవడం మన కనీస ధర్మం. వీటిని వేటాడే వారిపై ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదాన్ని మోపాలి.పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ప్రగతి మనందరికీ గర్వకారణం.

ఇది కేవలం పులుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అటవీ సంపదను పరిరక్షించడం, మానవ-వన్యప్రాణుల సహజీవనాన్ని ప్రోత్సహించడం వంటి విస్తృత లక్ష్యాలను కలిగి ఉంది. భవిష్యత్తులో కూడా ఈ సంరక్షణ ప్రయత్నాలను నిరంతరం కొనసాగించి మన జాతీయ జంతువును భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

అంతర్జాతీయ పులుల దినో త్సవం సందర్భంగా, పులుల సంరక్షణలో మన దేశం సాధించిన అద్భుతమైన ప్రగతిని ప్రశంసించకుం డా ఉండలేం. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈ దినోత్సవం, పులుల సంరక్షణ ప్రాముఖ్యతను మనందరికీ గుర్తు చేస్తుంది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్ టైగర్ సమ్మిట్లో సమావేశమైన 13 పులుల జనాభా దేశాలు, 2022 నాటికి ప్రపంచ పులుల జనాభాను రెట్టింపు చేయాలనే మహత్తర లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశాయి. 2025 ఇతివృత్తం 'మానవులు, పులుల మధ్య సామరస్య సహజీవనం' అనేది, ఉమ్మడి పర్యావరణ వ్యవస్థలకు ప్రయోజనం చేకూర్చే సమగ్ర పరిరక్షణ ప్రయత్నాల ఆవశ్యకతను స్పష్టంగా నొక్కి చెబుతోంది. ఒకప్పుడు ఆసియా ఖండం అంతటా స్వేచ్ఛగా సంచరించిన పులులు, దురదృష్టవశాత్తు నేడు ఆవాసాల విధ్వంసం, అక్రమ వేట, మానవ-వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘర్షణల కారణంగా గణనీయంగా తగ్గిపో యాయి. అయితే, ఈ క్లిష్టమైన పరిస్థితులలో, భారతదేశం ఒక ఆశాకిరణంగా, పులుల సంరక్షణకు ప్రపంచానికే ఒక మార్గదర్శిగా నిలుస్తోంది.

**- జనక మోహన రావు దుంగ**
8247045230



## మహిళల అభ్యున్నతికి కట్టుబడే.. కాంగ్రెస్ పార్టీ ముందడుగు

- స్వయం ఉపాధి కోసం మహిళల కృషి అభినందనీయం
- మహిళా సంఘాలకు అండగా రేవంత్ సర్కార్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, ఆగస్టు 4(మనం న్యూస్):** మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ఎల్లవేళలా పాటుపడుతుందని వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు .సోమవారం పట్టణంలోని భగవంతరావు నగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన రాజరాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీ పార్లర్ లతోపాటు మ్యాచింగ్ సెంటర్ ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు స్వయం ఉపాధి కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. మహిళా సంఘాల కోసం, మహిళల అభివృద్ధి కోసం, మహిళా మణులను లక్షాధికారులు చేయడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుంది అన్నారు. తమ స్వయంకృషితో రాజరాజేశ్వరి సెంటర్ ను ప్రారంభించుకున్న మారేపు హేమలత, శీలం స్వప్న, చందనగిరి తేజస్వి లను ఆది శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాజరాజేశ్వరి సెంటర్ నిర్వాహకులు, వారి బంధువులు పాల్గొన్నారు.

# సంక్షేమం, నాణ్యమైన విద్యకు పెద్ద పీట

- స్టీలు పాత్రలలోనే వంట వార్పు చేయాలి
- గురుకుల పాఠశాలకు స్టీలు పాత్రలు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాల్లో దశల వారీగా అమలు
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గురుకుల పాఠశాలలు
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**కరీంనగర్, ఆగస్టు 4(మనం ప్రతినిధి):** సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్టీలు పాత్రల్లో వంటావార్పు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో వంటకు కావలసిన స్టీలు పాత్రలను అందజేశారు. అంతకు ముందు భోజనశాల, వంట గదులు, అల్పాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించిన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి ఉదయం పాఠశాల అసెంబ్లీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అల్యూమినియం పాత్రల్లో ఆహారం నిల్వ ఉంచడం వల్ల కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయని, అందువల్ల రాష్ట్రంలోని సుమారు 700 గురుకులాల్లో స్టీలు పాత్రల్లో వంటవార్పును చేపట్టనున్నామని అన్నారు. మొట్టమొదటిగా కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రారంభించామని తెలిపారు. స్టీలు పాత్రల కోసం ప్రతి పాఠశాలకు నిధులు మంజూరు చేస్తామని అన్నారు. విద్యార్థుల, సంక్షేమం ఆరోగ్యం, బలవర్ధక ఆహారం నాణ్యమైన విద్యలే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలుగునూరు సంక్షేమ పాఠశాల విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు పేరు పొందిన విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం అభినందనీయమని తెలిపారు. అలుగునూర్ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి మాట్లాడుతూ స్టీల్ పాత్రల్లో వంట వార్పు విధానాన్ని కరీంనగర్‌లో ప్రారంభించామని, మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్ని కురుకులాలకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తామని అన్నారు. విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫోన్ మిత్రను ఉపయోగించుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఫోన్ మిత్ర ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అలుగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇక్కడ నిర్వహించిన విద్యార్థుల అసెంబ్లీ అద్భుతంగా ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వాహిని యూట్యూబ్ ఛానల్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి, ఆగస్టు 04(మనం ప్రతినిధి):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన పర్వీన్ తన భర్త కుద్భోద్దీన్ కు ఇటీవలే ప్రమాదం జరిగి కాలు తీసివేయడం జరిగిందని, తమకు కుటుంబ పోషణ కష్టంగా ఉందని, సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల (మహిళలు) లో వాచ్మెన్ ఖాళీగా ఉందని అట్టే అవుట్సోర్సింగ్ నౌకరి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పోచమ్మ కాలనీ కు చెందిన జి.రమేష్ తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలను కోరుతూ దరఖాస్తు చేసుకోగా పి.డి. డి.ఆర్.డి.ఏ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నంది మేడారం గోపాల్ రావు పేట గ్రామాలకు చెందిన రైతులు గోలివాడ నుండి గోపాలరావు పేట వరకు ఉన్న రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్ ధర్మారానికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల రక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

- కమిషనరేట్ పరిధిలో 193 మంది విముక్తి
- 18 కేసులు నమోదు
- అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో సాధించాం
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, ఆగస్ట్ 04(మనం న్యూస్):** అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్-11 ను విజయవంతంగా నిర్వహించామని అన్నారు రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా. ఈ మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జూలై 1 నుండి 31 వరకు జరిగిన ఈ ఆపరేషన్ లో మొత్తం 193 మంది బాల బాలికలకు విముక్తి కల్పించామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 71 మంది (52 బాలురు, 19 బాలికలు) 6 కేసులు నమోదు చేసి 8 మంది బాలకార్మికులను పాఠశాలలో చేర్పించామని, మంచిర్యాల జిల్లాలో 122 మంది (84 బాలురు, 38 బాలికలు) 12 కేసులు నమోదు చేసి 13 మంది బాలకార్మికులను పాఠశాలలో చేర్పించామని పేర్కొన్నారు సిపి. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చట్టపరమైన చర్యలు కొనసాగుతాయన్నారు. బాలల హక్కులను కాపాడటం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని,బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని, బాలలను బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని సిపి అభినందించారు.

## గ్రీవెన్స్ డే - బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- 19 మంది సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల, ఆగస్టు 04(మనం ప్రతినిధి):** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా, ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు.

ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి: మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల, ఆగస్టు 04 (మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలో నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ కు వినతి పత్రం అందచేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని ఉద్దేశంతో దాదాపు 80 గజాల విస్తీర్ణంలో నూకపెల్లి అర్బన్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మా ణాన్ని ప్రారంభించిందని జీవన్ రెడ్డి అన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం విడిపోవడం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత దాదాపు 2000 ఇందిరమ్మ ఇండ్లను కూల్చివేసి వాటి స్థానంలో 4520 డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించారని, మిగతా 1611 ఇందిర మ్మ ఇండ్లు వివిధ దశ లలో ఉండగా వాటి నిర్మాణానికి 52 కోట్ల రూపాయలు అవసరమని కలెక్టర్ నివేదించారు. కానీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాల కల్పన పేరుతో అందులో నుంచి 100 ఇండ్లను తొలగించారని, అందువలన చాలామంది ఇందిరమ్మ ఇండ్లను కోల్పోవడం జరిగిందని జీవన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించా లని, 3500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో కేవలం 500 మంది మాత్రమే ప్రస్తుతం నివాసం ఉంటు న్నారని, మిగతా 3000 మంది ఎందుకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రావడం లేదు వాళ్ళు నిజంగా అర్హులా ? కాదా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. నూతనంగా ఇండ్లు నిర్మించినప్పుడు వెంటనే అన్ని రకాల సదుపాయాలు ఏర్పడడం అనేది సాధ్యం కాదన్నారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కార మార్గం చూపాలి: కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల, ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరెట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, ఆర్డీఓలతో తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 43 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓ లు మధుసూధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్‌లు, డీపీఆర్వో రఘువరన్, డీపీఓ మదన్ మోహన్, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ నార్కోటిక్ డాగ్‌గా సింబా

- రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌లో బంగారు పతకం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, ఆగస్ట్ 04(మనం న్యూస్):** వరంగల్ జిల్లా మమునూరు పిటిసిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్ లో కాళేశ్వరం జోన్ నుండి రామగుండం కమిషనరేట్ కు చెందిన నార్కోటిక్ డాగ్ 'సింబా' గంజాయి, మత్తు పదార్థాలు గుర్తించడంలో అద్భుత ప్రతిభ చూపి గోల్ మెడల్ సాధించింది. డాగ్ హ్యాండ్లర్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ కృష్ణతో కలిసి ఈ ఘనత సాధించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్‌గా సింబాను ఎంపిక చేశారు. రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా సోమవారం తమ కార్యాలయంలో నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హాండ్లర్ ను అభినందించారు. ఈ సందర్భంగా సింబా 2026 ఫిబ్రవరిలో పుణేలో జరిగే నేషనల్ డ్యూటీ మీట్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, పెద్దపల్లి డిసిపి పి కరుణాకర్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను ప్రజా ప్రతినిధులుగా నిలిపే పార్టీ బీజేపీ మాత్రమే..

- అసలైన కార్యకర్తలకు నిజమైన గుర్తింపు బిజెపితోనే
- నల్లా చేరిక బీజేపీకి అదనపు బలం
- రాష్ట్ర అధ్యక్షుడి సభను విజయవంతం చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి



**పెద్దపల్లి, ఆగస్టు 04(మనం ప్రతినిధి):** కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా గెలిపించుకునే పార్టీ కేవలం భారతీయ జనతా పార్టీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన నల్లా మనోహర్ రెడ్డి తన అనుచరులతో కలిసి మంగళవారం బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎంబీ గార్డెనులో జరిగే చేరికల కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామ చంద్రరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో రాష్ట్ర అధ్యక్షుడితో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని వివరించారు. దాదాపు రెండువేల మందితో ర్యాలీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నల్లా మనోహర్ రెడ్డి చేరిక బీజేపీకి అదనపు బలం అవుతుందని, అసలైన కార్యకర్తలకు గుర్తింపు బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. జిల్లాలో ఊహించని విధంగా బిజెపి ఎదుగుతోందని ఇదే పరిస్థితి కొనసాగితే మునిసిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులను అత్యధిక స్థానాల్లో గెలుపొందుతా మని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, జంగ చక్రధరరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పర్వ సమ్మయ్య, అక్కెపల్లి క్రాంతి, మౌటం నర్సింగం, మంథెన క్రిష్ణ, కొమల్ల మహేష్, అమరగాని ప్రదీప్, తూడి రవీందర్, భూషణవేణి శ్రీనివాస్ గౌడ్, ముస్త్యాల సంతోష్, కాసనగొట్టు విజయ్, శివంగారి సతీష్, మేరుగు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి వైపు యువత పయనం.. అభినందనీయం

- హైదరాబాద్ వరహాలు అడ్వాన్స్డ్ స్టూడియో ఏర్పాటు
- ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



**వేములవాడ, ఆగస్టు 4(మనం న్యూస్):** ఒకటవ తరగతి నుండి బీటెక్ వరకు కలిసి చదువుకున్న నలుగురు యువకులు స్వయం ఉపాధి వెతుక్కుంటూ తమ భవిష్యత్తు కోసం సోమవారం అడుగులు వేశారు. బీటెక్ పూర్తి చేసుకొని ఉద్యోగ అవకాశాల కోసం కొంతకాలం ఎదురు చూశారు. ఉద్యోగాలు అందకపోవడంతో స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్‌లో మ్యాడ్ ఫోటోగ్రఫీ ఇట్స్ ఏ న్యూ బిగినింగ్ స్టూడియోను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి శేషాద్రిని రెడ్డి స్టూడియోను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపడం అభినందనీయం అన్నారు. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉండే అడ్వానస్డ్ ఫోటోగ్రఫీ పరికరాలతో వేములవాడలో ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. అలాగే ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న పాడ్కాస్ట్, ఇంటర్వ్యూస్, కూడా ఈ స్టూడియో లో నిర్వహించేందుకు వీలు కల్పించడం వల్ల సృజనాత్మకత ఉన్న యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పట్టణ ప్రజలకు ఎక్కడికో వెళ్లకుండా వేములవాడ పట్టణంలోనే అన్ని హంగులతో స్టూడియో అందుబాటులోకి తీసుకు వచ్చారని నిర్వాహకులను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, క్లాస్ మేట్స్ అయిన ఇఖ్బార్ పాషా, అరవింద్, నితిన్, సునీల్‌తో పాటు తాహేర్ పాషా, నగుబోతు రవి, కుమ్మరి శంకర్, నారాయణ రెడ్డి, ఆనంద రెడ్డి, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, తదితరులు ఉన్నారు.

# రైతాంగ సాధికారతతోనే జాతీయ సమైక్యత

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గీతం జాతీయ చర్చా గోష్ఠిని ప్రారంభించిన గవర్నర్




**రామచంద్రపురం, ఆగస్టు 4(మనం న్యూస్):** గ్రామీణ ప్రజలు, భారత రైతాంగ సాధికారతతోనే జాతీయ సమైక్యత బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని రాజకీయ శాస్త్ర (పొలిటికల్ సైన్స్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు: చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు' జాతీయ చర్చాగోష్ఠిని సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలనలతో లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తరువాత 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ అద్భుతమైన పాత్రను వివరించారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేదన్నారు. చారిత్రాత్మక బార్డోలి సత్యాగ్రహం (1928)లో పటేల్ నాయకత్వాన్ని, రైతులు, భూమిలేని కార్మికుల సాధికారత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషిని గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామీణ భారతదేశం జాతికి ఆత్మగా మిగిలిపోతుందని చెప్పారు. రైతులు, జాతీయ ఐక్యత పట్ల పటేల్ దృక్పథంపై ఈ చర్చాగోష్ఠిలో విలువైన చర్చలకు దారితీస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. 'మన జీవితాలను పేదలు, అణగారిన వర్గాలతో పంచుకోవడంలో ఆనందం ఉంది' అని శ్రీ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యానించారు. అంతకు ముందు, శ్రీ శర్మ మహాత్మా గాంధీకి విగ్రహానికి పూలుచల్లి నివాళులర్పించి, ఆ తరువాత పోలీసుల నుంచి గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరించారు. 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' యొక్క విశిష్టతను గౌరవ అతిథి, గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్ట్-సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సంజయ్ జోషి వివరించారు. ఐక్యతా స్ఫూర్తిని పొందడం కోసం గుజరాత్ లో నెలకొల్పిన సర్దార్ పటేల్ స్మారక నివాళిని సందర్శించమని విద్యార్థులను జోషి ప్రోత్సహించారు. సామాజిక సమరస్థ మంచ్ జాతీయ కన్వీనర్ శ్రీ కె.శ్యామ్ ప్రసాద్ పటేల్ నాయకత్వం గురించి ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు, ఆయనపై రాజ్ మోహన్ గాంధీ రచించిన పుస్తక ప్రతులను వేదికపైనున్న ప్రముఖులకు బహూకరించారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు స్వాగత ఉపన్యాసంలో అతిథులను సభకు పరిచయం చేయడంతో పాటు గీతం పురోగతిని సోదాహరణంగా వివరించారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ గుబ్బం అశోక్ వందన సమర్పణతో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ పండితులు, ఆలోచనాపరులు ఈ రెండు రోజుల జాతీయ చర్చాగోష్ఠిలో పాల్గొంటున్నారు. వీరిలో గుజరాత్ లోని సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, తెలంగాణలోని ములుగులోని సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్; ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇంచార్జ్ రిజిస్ట్రార్ అండ్ డీన్ ప్రొఫెసర్ షీలా రెడ్డి; హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.నాగరాజు; అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి; ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి; యూజీసీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డి తదితరులున్నారు. సర్దార్ పటేల్ రైతుల పట్ల చూపిన దార్శనికత, భారతదేశ గ్రామీణ, వ్యవసాయ పరివర్తనకు దాని ఔచిత్యంతో పాటు జాతీయ ఐక్యతను పెంపొందించడంలో దాని సహకారంపై చర్చించడానికి విద్యావేత్తలు, సామాజికవేత్తలు, పరిశోధకులకు ఈ సెమినార్ ఒక వేదికను అందిస్తోంది.




## సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి భరోసా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ. 2 లక్షల 50 వేలకు ఎల్ఓసీ

**రామచంద్రపురం, ఆగస్టు 4(మనం న్యూస్):** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కుమ్మరి బస్వరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసీని సోమవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, వెంకట్ రెడ్డి, దశరథ రెడ్డి, పాండు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

- డీఆర్వో పద్మజా రాణి



**సంగారెడ్డి ఆగస్టు 4(మనం ప్రతినిధి):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చేయవలసిన ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) పద్మజ రాణి ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి ముందస్తు సన్నాహక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, మెడికల్ టీమ్, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, బహిరంగ మైదాన ఏర్పాట్లు తదితర అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, విద్య, ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నుల్లి పురుగుల నివారణ మాత్రలు అందించండి

- జిల్లాలో 2461 కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 11వ తేదీన పంపిణీ
- జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట రూరల్, ఆగస్టు 04(మనం న్యూస్):** చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు నుల్లి పురుగుల నివారణకుబీ 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రం వేయించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. ఈనెల 11వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంను పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 2,29,361 మంది ఉన్నారని వారికి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 2461 కేంద్రాల ద్వారా ఈనెల 11 వ తేదీన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు స్వయంగా వైద్య ఆరోగ్య సిబ్బందిచే వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు ఆడుకున్నప్పుడు, చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకున్నపుడు, బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయుట వలన, అపరిశుభ్ర పరిసరాల వలన ఇవి సంక్రమిస్తాయని పిల్లలలో నులిపురుగుల సంక్రమణ ప్రభావం వలన రక్తహీనత, చురుకుదనం, పోషకాహార లోపం, ఆకలి లేకపోవుట, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి వికారం, విరేచనాలు లాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయన్నారు. దీనివలన పిల్లలు ఏకాగ్రత కోల్పోతారని, పని సామర్థ్యం తగ్గిపోతుందని, హాజరు శాతం తగ్గిపోవడం, పిల్లల్లో కడుపునొప్పి లాంటి సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ఈ మాత్రల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు కలగవని, ఆగస్టు 11 వ తేదీ నాడు ఈ మాత్రలు తీసుకోని పిల్లలకు ఆగస్టు 18వ తేదీన ఆరోగ్య సిబ్బందిచే పంపిణీ చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లల ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ప్రతి పాఠశాల, ప్రతి అంగన్వాడి సెంటర్, ప్రతి కాలేజీలో ఒకరు విధిగా ఆల్బెండజోల్ మాత్రలను అందించే విధంగా ప్రణాళిక చేసుకోవాలని, పిల్లలు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే ఈ మాత్రలు వేయాలని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని రకాలుగా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉందని, క్షేత్రస్థాయిలోని సిబ్బందికి ట్రైనింగ్ నిర్వహించడం జరిగిందని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డీఎం.హెచ్.ఓ. డాక్టర్ శ్రీనివాస్, డి.డబ్ల్యు.ఓ. లక్ష్మీ కాంత్ రెడ్డి, రంగనాథ్ స్వామి విద్య శాఖ, శ్రీనివాస్, రామకృష్ణ, డాక్టర్ చందర్ ఐఎంఏ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డాక్టర్ కె.టీ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్, ఏఎస్ఓ రమాదేవి, డిప్యూటీ ఎస్ఓ శ్రావణి, డెమో నవీన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, ఆగస్టు 4(మనం ప్రతినిధి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున కమ్మరపల్లి గ్రామం, నిజాంబాద్ జిల్లా, ప్రస్తుతం ఏసపల్లి ఆర్మూర్ మండలంలో నివాసముంటున్న టేకు చిరంజీవి (22) అనే అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుండి భారీ మొత్తంలో దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలు, నగదు, దొంగతనాలకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిజామాబాద్ జిల్లాకు చెందిన టేకు చిరంజీవి (22) హార్వెస్టర్ డ్రైవర్గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇతను పగలంతా తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతను తన కారులో కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోని వేర్వేరు గ్రామాల్లో దొంగతనాలు చేసినట్లు తెలిపారు.

### చోరీల వివరాలు..

మే 7, 2025 నిజామాబాద్ జిల్లా, వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసి సుమారు 66 గ్రాముల బంగారం దొంగిలించాడు. ఈ బంగారాన్ని తన తండ్రి గంగ సాయిలు సహాయంతో నందిపేటలోని బంగారు నరసయ్య అనే వ్యక్తికి విక్రయించాడు. జూన్ 10, 2025 కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం మండలంలో ఒక ఇంట్లో పావు తులం బంగారు గొలుసు, 4 తులాల వెండి గొలుసులు, రూ. 5,000/- నగదు చోరీ చేశాడు. జూన్ 30, 2025 రామడుగు మండలం, శానగర్ గ్రామంలో 5 తులాల బంగారు హారం దొంగిలించాడు. జూలై 16, 2025 మానకొండూరు మండలం, గంగిపల్లి గ్రామంలో ఒక తులం బంగారు చైన్, 6 తులాల వెండి, 30,000/- నగదు ఎత్తుకుపోయాడు. జూలై 22, 2025 తిమ్మాపూర్ మండలం, పోరండ్ల గ్రామంలో ఏకంగా మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడి సుమారు 2.75 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 1,65,000/- నగదు దొంగిలించాడు. జూలై 23, 2025 చిగురుమామిడి మండలం, బొమ్మనపల్లి గ్రామంలో ఒక బంగారు షాపుతో సహా మూడు చోట్ల దొంగతనం చేసి సుమారు 5.5 తులాల బంగారం, 90 తులాల వెండి చోరీ చేశాడు. జూలై 24, 2025 గన్నేరువరం మండలం, చీమలకుంటపల్లి గ్రామంలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి చోరీ చేశాడు.

### సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్...

చిరంజీవి నుండి దొంగసొత్తు కొనుగోలు చేసిన, నిజామాబాద్ జిల్లాలోని నందిపేట మండల కేంద్రంలో బంగారు షాపు నడుపుకొని జీవిస్తున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నరసయ్య (44)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను నందిపేటలో బంగారు షాపు నడుపుతూ, తక్కువ ధరకు దొంగిలించిన ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. చిరంజీవి మరియు అతని తండ్రి గంగ సాయిలు ఇతనికి మే 10, 2025న సుమారు 66 గ్రాముల బంగారం విక్రయించగా, బంగారు నరసయ్య వారికి రూ. 1,14,000/- చెల్లించినట్లు తెలిపాడు.

### స్వాధీనం చేసుకున్న వస్తువులు...

పోలీసులు నిందితుల నుండి మొత్తం 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ. 1,00,000/- నగదు, ఒక మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన కారు, ఇనుప రాడ్లు, గ్లౌజులు వంటి పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కమీషనరేట్ పరిధిలో దొంగతనాల నివారణకు పోలీసులు నిఘా పెంచుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఏసిపి వెంకటస్వామి, సి.సి.ఎస్ ఏసిపి జాన్ నర్సింహులు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్ ప్రకాష్, ఎల్.ఎం.డి. ఎస్ఐ శ్రీకాంత్ క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్ , సీసీఎస్ కానిస్టేబుళ్లు రాజశేఖర్ , వేణుగోపాల్, అనిల్, అవినాష్ లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా పోలీసులను అభినందించారు.

## గిరిజన హాస్టళ్ల అభివృద్ధి పనులపై సమీక్ష

- సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల ఆగస్టు 04(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. గిరిజన తండా గ్రామాలలో గిరిజన హాస్టల్ విద్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన అభివృద్ధి పనులపై, ఇంకా విద్యార్థులు, వారి సమస్యలు, సాధక బాధకాలపై కలెక్టర్ సత్య ప్రసాద్ సమీక్షించారు. గిరిజన తండాల గ్రామాలలో, గిరిజన హాస్టల్ విద్యాలయాలలో అభివృద్ధి పనులపై సీసీ రోడ్లు మరియు డ్రైనేజీలు, తాగునీటి వసతులు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఏవైనా మిగిలిన పనులు ఉన్నట్లయితే రెండు రోజుల్లో తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీఓ గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్ కుమార్, డీసీ సంపత్, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సంగారెడ్డి, జూలై 4(మనం ప్రతినిధి):** .పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వెటు వేయాలని అసెంబ్లీలోని గాంధీ విగ్రహం ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిర్వహించిన ధర్నాలో సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు పాల్గొన్నారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ... పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హతమేయాలని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అర్హత వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సభపాతిని కోరుతున్నామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు.



## ప్రజా సేవకే పాలక వర్గం: చైర్‌పర్సన్ మంజుల

- ఎమ్మెల్యే హరీష్ రావు కృషితోనే అభివృద్ధి
- అవినీతికి పాల్పడితే ఎవరైనా ఉపేక్షించం
- సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు



**సిద్దిపేట, ఆగస్టు 04(మనం న్యూస్ ప్రతినిధి):** సిద్దిపేట మున్సిపాలిటీ పాలకవర్గం ప్రజలకు సేవ చేసేందుకే నిరంతరం కృషి చేస్తుందని, దీనిపై ప్రజల్లో తప్పుడు అవగాహన తీసుకురావడం సరికాదని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధి ముమ్మాటికీ బీఆర్ఎస్ హయాంలోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో ఎంతగానో అభివృద్ధి జరిగిందని వారు స్పష్టం చేశారు. నేడు సిద్దిపేట మున్సిపాలిటీ దేశంలోని ఎన్నో మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తుందంటే దానికి కారణం ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక చొరవే కారణమన్నారు. బీఆర్ఎస్ హయాంలో గెలిచిన పలువురు కౌన్సిలర్లు నేడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని పలువురు కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, ఏవైనా ఆధారాలుంటే వెంటనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు. అవినీతి జరిగినట్లుగా నిరూపిస్తే వారికి పాలకవర్గం తరుపున తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, అంతే కానీ ప్రజల్లో మున్సిపల్ పాలకవర్గం పట్ల అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో తప్పుడు అవగాహన తీసుకురావడం సరికాదన్నారు. మున్సిపల్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలందించి సిబ్బందిని ప్రోత్సహించడం జరుగుతుందని, ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు రుజువైతే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని, అట్టి వివరాలు ఉంటే వెంటనే ప్రభుత్వం ముందుంచాలన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటా
- 7న జయారెడ్డి వివాహానికి అందరు రావాలని పిలుపు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- కార్యకర్తల సభలో కంటతడి పెట్టిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి/ కొండాపూర్ (మనం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. నాలుగు జెడ్పీటీసిలు, నాలుగు ఎంపీపీలు, రెండు మున్సిపల్ చైర్మన్ గెలుపే లక్ష్యంగా పనిచేయలని కార్యకర్తలకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని గెలిపి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని క్యాన్సర్ బాధితులకు తాను అండగా ఉంటానని నియోజకవర్గంలోని ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తినట్టయితే తనను సంప్రదించవచ్చని తెలిపారు.ఆగస్టు 7 తేదీన జయా రెడ్డి వివాహ మహోత్సవానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు ప్రజలు అందరూ రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కంటతడి 2017 రాహుల్ సభ ఏర్పాటు చేసుకోవడానికి కోసం తన దగ్గర డబ్బు లేదని ఆ సమయంలో ఏం చేయాలో అర్థం కాలేదని ఆ సమయంలో జూలకంటి ఆంజనేయులు తన సొంత భూమి అమ్మి సభ ఏర్పాట్లకు ఖర్చు చేశానని ఇప్పటికీ అతనికి ఆ డబ్బు తిరిగి ఇవ్వలేదని గుర్తు చేసుకుంటూ ఒక్కసారిగా కంటతడి పెట్టారు .ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కొండాపూర్ మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, మారేపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్, కొండాపూర్ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే కొండబాల

- కొండబాలది దశాబ్దాల ప్రజా జీవితం
- ప్రజల అవసరాలు తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, ఆగస్టు 4(మనం బ్యూరో): మాజీ ఎంఎల్ఏ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి కొండబాలను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేగా, టిడిపి జిల్లా అధ్యక్షునిగా సర్పంచి స్థాయి నుంచి మొదలుకొని ఎమ్మెల్యేగా దశాబ్దాల కాలాల పాటు రాజకీయ అనుభవం కలిగిన కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానన్నారు. స్థానిక సంస్థలు, సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా, టిఆర్ఎస్ హయాంలో కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన ఆయనకు చట్టసభలపై చక్కని అవగాహన ఉందన్నారు. అందరం కలిసి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలను, ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల వద్దకు తీసుకువెళ్దామని అన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకొని తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దామని పేర్కొన్నారు.

**సొంత ఇంటికి వచ్చిన కొండబాలకు స్వాగతం: మహేష్ కుమార్ గౌడ్**

సొంత ఇంటికి తిరిగి వచ్చిన కొండబాల కోటేశ్వరరావుకు స్వాగతం తెలియజేస్తున్నానని, వారి చేరికతో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్న వాటిలో చేర్చుకుంటున్నట్టు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

**దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌లో చేరా : కొండబాల**

దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆ పార్టీలో చేరుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరావు ప్రకటించారు. సుదీర్ఘకాలంగా ఖమ్మం జిల్లాలో అనేక హోదాల్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేసి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులతో సంబంధాలు కలిగి ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో జిల్లా జనరల్ సెక్రెటరీ స్థాయి వరకు వెళ్లానని, కాంగ్రెస్ అభ్యర్థిగా సమితికి సైతం పోటీ చేశానని కొండబాల తెలిపారు. ఈ దేశంలో పేద ప్రజల కోసం పని చేసింది కేవలం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. పేద ప్రజల కోసం పబ్లిక్ సెక్టార్ లో పరిశ్రమలను నెలకొల్పిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకి దక్కిందన్నారు. పేద వర్గాల సంక్షేమం కోసం పండిట్ జవహర్లాల్ నెహ్రూ గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అమెరికా ప్రభుత్వం లో పనిచేస్తున్న ఎస్‌కెడే ను భారతదేశానికి రప్పించి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేశారని కొండబాల గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ఈ దేశాన్ని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని, ఈ అభివృద్ధిలో తన వంతు పాత్ర ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు కొండబాల ప్రకటించారు. తనతో పాటు ప్రస్తుతం కొంతమంది వచ్చారని, రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కొండబాల తెలిపారు.

# ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతపై మాజీ ఎంపీ నామ ఆరా



ఖమ్మం, ఆగస్టు 4(మనం న్యూస్): ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో పలువురు బాలికలు సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరా తీశారు. విద్యార్థినులు ప్రస్తుతం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వారిని జిల్లా కేంద్రానికి తీసుకువెళ్ళి వైద్యం అందించాలన్నారు. గత పదిహేడవ లోక్ సభ సమయంలో తన నిధులు నుండి కేటాయించిన అంబులెన్సు స్థానిక కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్లోనే అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతూనే, సమస్యల మూలాలను పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలు గిరిజన పిల్లలకు విద్య అందించే ముఖ్య కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థుల ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న వరుస సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో పాటు అధికారులను కోరారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని నామ పేర్కొన్నారు.

# ఇజ్రాయిల్ దుర్మార్గంపై కవుల నిరసన గళం




ఖమ్మం, ఆగస్టు 4(మనం న్యూస్): పాలస్తీనాపై ఇజ్రాయిల్ దౌర్జన్యాన్ని అనేక మంది కవులు నిరసిస్తూ గళమెత్తారు. ఆగష్టు 7న ఖమ్మంలో రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు తలపెట్టిన పాలస్తీనా సంఘీభావ ర్యాలీకి అనుబంధంగా టెండర్ రూట్స్ పాఠశాలలో సోమవారం కవి సమ్మేళనం జరిగింది. ఖమ్మంలోని టెండర్ రూట్స్ పాఠశాలలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో అనేక మంది కవులు పాల్గొన్నారు. కవులు తమ రచనల ద్వారా యుద్ధ విధ్వంసం, పాలస్తీనా ప్రజల బాధలు, శాంతి కోసం పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజల బాధలను హైలైట్ చేయడానికి, ఇజ్రాయిల్ దాడులను ఖండించడానికి ఒక వేదికగా ఏర్పాటు చేయడం ఈ కవిసమ్మేళనం ప్రధాన ఉద్దేశం. పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను ఖండించడం, వారి పట్ల సానుభూతిని వ్యక్తం చేయడం తదితర అంశాల ఇతివృత్తంగానే కవులు కవితలు చదివారు. కవులు ప్రసేన్, సీతారాం, రవిమారుత్, రమణ, కపిల రాం కుమార్, కటుకోజ్వల రమేష్, తోట సుభాషిణి, ఇబ్రహీం నిర్గుణ్, రాధ, మణి కుమారి, శ్రీలక్ష్మి, ఆనందాచారి, విఆర్ తూములూరి, సిహెచ్ ఆంజనేయులు, వురిమళ్ల సునంద తదితర అనేక మంది కవులు తమ కవితల్లో ఆగ్రహం, ఆవేదన వినిపించారు. ఈ కార్యక్రమంలో కవులు తమ కవితల ద్వారా సామాజిక న్యాయం, శాంతి, మానవీయ సందేశాన్ని ప్రజలకు అందించే ప్రయత్నం చేసారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి ఒక మార్గంగా ఉపయోపడింది. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సీఎం శిబు సోరెన్ మరణం పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం



ఖమ్మం, ఆగస్టు 4(మనం న్యూస్): జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత, మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణం పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఒక ఉద్యమ నాయకుడిగా, ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా శిబు సోరెన్ నిలిచారని నామ కొనియాడారు. ఆయన జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆదివాసీ హక్కుల కోసం దశాబ్దాల పాటు పోరాడిన ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, శిబు సోరెన్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన మద్దతు తెలిపారని నామ గుర్తు చేశారు. పేదలకు, వెనుకబడిన వారికి న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని, శిబు సోరెన్ ఒక నిజమైన ప్రజానాయకుడని, ప్రజల నాడిని అర్థం చేసుకునే నేతగా కొనియాడుతూ, భారత రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి అని నామ తెలిపారు. శిబు సోరెన్ నాయకత్వ లక్షణాలు ప్రతి రాజకీయ నాయకుడికి ఆదర్శమని, ఆయన మరణం జార్ఖండ్ రాష్ట్రానికే కాదు, దేశానికే తీరని లోటు అని పేర్కొన్నారు. అవకాశాల కోసం కాకుండా, ఉద్యమాల కోసం రాజకీయాల్లోకి వచ్చిన గొప్ప నేత శిబు సోరెన్ అని, ఆయన జీవితం, పోరాటం, త్యాగం కొత్త తరానికి ప్రేరణ అని అభిప్రాయపడ్డారు. ప్రజలతో సన్నిహితంగా మమేకమైన నేతలలో ఆయన ముందు వరుసలో ఉండేవారన్నారని, పార్లమెంట్లో ఆదివాసీల గొంతుగా నిలిచిన గొప్ప నేత అని కొనియాడారు. ఎనిమిది సార్లు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన సోరెన్ తో తనకు 15వ లోక్ సభ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత గా వున్నపుడు ఉన్న రాజకీయ పరిచయాన్ని నామ గుర్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడే విధానం, ప్రజల మధ్య తిరిగే తీరు చిరకాలం గుర్తుండిపోతుందని, జీవితాంతం ప్రజల కోసమే జీవించిన నాయకుడు అని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన నామ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రాంతీయ ఫోరెన్సిక్ వ్యాన్ ప్రారంభం

ఖమ్మం, ఆగష్టు 4(మనం బ్యూరో): నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ప్రారంభించారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తి సదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్ గా పనిచేస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశంలో లభించిన అన్ని రకాల సాక్ష్యాలను (ఫింగర్ ప్రింట్స్, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలు) సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈ వాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, డాక్టర్ వి.నాగలక్ష్మి (శాస్త్రీయ అధికారి) కె.సుధాకర్ (శాస్త్రీయ అధికారి)కె. నరసింహ (అసిస్టెంట్ డైరెక్టర్)ఆర్ ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగులుమీరా తదితరులు పాల్గొన్నారు.

**త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్**

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సిసిటిఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏ విధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను





కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 04 (మనం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుజాజీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్, హౌసింగ్ పీడీ రవీందర్ నాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

**ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులలో ముఖ్యమైనవి :**

రామవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చిట్టి రామవరం తండా, 19వ డివిజన్లో నివసిస్తున్న గిరిజన లంబాడి పోడు రైతులు కొంతమంది సర్వే నెంబర్ 20 లో గల ఆర్వోఎఫ్ఆర్ అటవీ శాఖ పోడు భూములను గత 40 సంవత్సరాలుగా తమ పూర్వీకుల నుండి పోడు నరికి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, గతంలో మొత్తం 340 మంది పోడు రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేయగా, అందులో 97 మంది రైతులకు మాత్రమే పట్టాలు మంజూరు అయ్యాయని, మిగిలిన వారికి పట్టాలు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం భద్రాచలం ఐటీడీఏ పీవో కు ఎండార్స్ చేశారు. చంద్రుగొండ మండలం వెంకట్య తండా పంచాయతీ పరిధిలోని కరశలబోడు తండాలో పోడు వ్యవసాయం చేస్తున్న రైతు ధారావత్ లక్ష్మి తాము ప్రభుత్వ అనుమతితో బోరు వేసుకున్నామని, ఆ బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం 200 మీటర్లు ఉన్న ట్రాన్స్ఫారం నుండి తీసుకునేందుకు అనుమతించాలని కోరుతూ చేసిన దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పెనుగొండ రాజేశ్వరి భార్యాభర్తలు వివిధ కారణాల చేత విడిపోవడం జరిగిందని, రామానుజవరం గ్రామంలో సర్వేనెంబర్ 853 లో సుమారు 0.20 కుంటల భూమిని తనకు రాసి ఇవ్వడం జరిగిందని ఆ భూమి మణుగూరు సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా భూసేకరణకు గురి అవుతున్నందువలన, తనకు రాసిచ్చిన భూమి నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఈ సెక్షన్ సూపర్డెంట్ కు ఎండార్స్ చేశారు. ఇల్లందు రెండవ నెంబర్ బస్తి లో నివాసం ఉంటున్న సిలువేరు చంద్రావతి తాను ఒంటరి మహిళనని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డిఆర్‌డిఓకు ఎండార్స్ చేసారు. చర్ల మండలం, చర్ల గ్రామంలో నివాసం ఉంటున్న భోగాల శివ తన తాత కొండమల్ల నరసింహారావు వాజేడు తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్ఏ గా విధులు నిర్వహిస్తూ చనిపోయారని, తన తాత ఉద్యోగం తమ కుటుంబానికి ఏ విధమైన సంబంధం లేనటువంటి వ్యక్తి తప్పుడు ధృవపత్రాలు సృష్టించి జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారని, పూర్తి విచారణ జరిపి న్యాయం చేకూర్చాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం కలెక్టరేట్ పరిపాలన అధికారికి ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో అభివృద్ధి పనుల జాతర

## ఒక్కరోజే రూ.665.81కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సావాలు

## ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు అనునిత్యం తపిస్తున్నా

## కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం/చుంచుపల్లి/సుజాతనగర్, ఆగస్టు 4(మనం న్యూస్): కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జాతరను తలపించాయి. మూడు మండలాల పరిధిలో ఎన్ఆర్ఈజిఎస్, సిఆర్ఆర్, ఎస్సిపి, డిఎంఎఫ్టి, వివిధ సంస్థల సిఎస్ఆర్ నిధులు రూ.665.31కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో పూర్తయిన పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కొత్తగూడెం పట్టణంలో జెన్కో సిఆర్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న బిసి బాలికల భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఒక్కరోజే 103 పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని, లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, సంజయ్ నగర్, అశోక్ నగర్ పంచాయతీల్లో రూ.414.5కోట్లు, చుంచుపల్లి మండలంలో రూ.64లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.37లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ళు, ప్రభుత్వ భవనాలు, వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సావాలు, శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు తపిస్తున్నాని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. గ్రామాలు, బస్తీల్లో అభివృద్ధి నిధుల కేటాయింపులో ఎలాంటి వ్యత్యాసం ఉండబోదని, ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం, జాప్యాన్ని సహించబోనని, దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పూర్తయిన పనుల నిర్వహణ బాధ్యత మున్సిపల్, గ్రామపంచాయతి, ఇతర ప్రభుత్వ శాఖలదేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఈఈ వెంకటేశ్వర్ రావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, పంచాయతిరాజ్ డిఈ రామకృష్ణ, ఏఈ శివలాల్, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖ, ఐటిసిఏ అధికారులు, వ్యవసాయ శాఖ, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

- 11న జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు
- నులిపురుగుల నివారణకు మందుల పంపిణీపై జిల్లా కలెక్టర్ సమీక్ష



ఖమ్మం, ఆగస్టు 04(మనం బ్యూరో): నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నులి పురుగుల నివారణకు చేపట్టే అల్బెండజోల్ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నులి పురుగుల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా అందించాలని, లేని పక్షంలో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుందని అన్నారు. నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటి వల్ల రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని అన్నారు. నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం, పోలియో తరహాలో ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు మందుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో నులి పురుగుల పంపిణీ సమయంలో ఎక్కడైనా విద్యార్థులకు సైడ్ ఎఫెక్ట్స్ వస్తే చికిత్స అందించేందుకు వైద్య బృందాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ఆగస్టు 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలందరికి తప్పనిసరిగా మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆగస్టు 11 నాడు మాత్రలు అందించని విద్యార్థులకు తప్పనిసరిగా ఆగస్టు 18 నాడు అందించాలని అన్నారు.విద్యా సంస్థల బయట ఎవరైనా పిల్లలు ఉంటే వారికి కూడా తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మందులు అందేలా కార్యాచరణ చేయాలని అన్నారు. మాత్రలు ఇంటికి తీసుకెళ్లడానికి ఇవ్వకూడదని, పాఠశాలల్లోనే టీచర్ల సమక్షంలోనే మందులు వేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు ముందస్తు సమాచారం అందించి పూర్తి స్థాయిలో విద్యార్థులు ఆ రోజు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామాలలో స్థానిక నాయకులు, పంచాయతి కార్యదర్శులు సైతం తమ గ్రామాలలో పూర్తి స్థాయిలో విద్యార్థులకు మాత్రలు అందేలా పర్యవేక్షించాలని, కార్యక్రమం గురించి గ్రామంలో డప్పు చాటింపు వేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న ప్రతి పిల్లవాడికి తప్పని సరిగా మాత్రలు అందే విధంగా జిల్లా విద్యా శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, పాఠశాలలకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ నిర్వహణ, మాత్రల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ నెల 5 నుండి 8 వరకు మండల స్థాయిలో మండల అధికారులతో మండల టాస్క్ ఫోర్స్ సమావేశాలను చేపట్టాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ, జిల్లాలో అవసరమైన మేర నులిపురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచుకున్నామని, 1339 మంది ఆశావర్కర్లు, 1750 అంగన్ వాడి టీచర్లు, 1260 వైద్య సిబ్బంది, 1618 పాఠశాల జూనియర్ కళాశాలల ప్రతినిధులు నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. నులి పురుగుల నివారణ కోసం మందుల పంపిణీ కార్యక్రమం కోసం వివిధ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే పిల్లలందరికీ ఆగస్టు 11న నులి పురుగుల నివారణ మందులు వేయాలని అన్నారు. ఆగస్టు 11న వేయని వారికి ఆగస్టు 18 నాడు మాప్ అప్ డే సందర్భంగా మందులు వేయాలని అన్నారు. జిల్లాలోని 1840 అంగన్వాడి కేంద్రాల్లోని 74 వేల 641 పిల్లలకు, 1263 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 334 ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలోని 19 సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల సాకారం...
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి....
- 2విడత అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ...

కల్వకుర్తి ఆగస్టు 04(మనం న్యూస్): ప్రజా సంక్షేమ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కల్వకుర్తి మున్సిపాలిటీలోని అర్హులైన 109 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరైన ఇంటి నిర్మాణ పత్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేద ప్రజలకు సొంతింటి కల సాకారమవుతుందని అన్నారు.పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని మరిచిందని విమర్శించారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 నుంచి 600 చదరపు గజాల లోపు ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంక్షేమం కోసం పాటుపడడమే కాకుండా మహిళలలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వడ్డీ లేని రుణాలు అందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తుందని అన్నారు.కల్వకుర్తి మున్సిపాలిటీలో ఫుట్ పాత్ వ్యాపారస్తులకు ప్రత్యేక షెడ్ లు ఏర్పాటు చేసి చాలా రోజులైందని ఈనెల 11న నిజమైన వ్యాపారస్తులకు వాటిని పారదర్శకంగా పంపిణీ చేసేందుకు కమీషనర్,స్థానిక నాయకులు దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ఎన్నో కోట్ల నిధులు తెచ్చామని మరో 15 కోట్ల అభివృద్ధి పనులకు నివేదికలు సిద్ధం చేశానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో అభివృద్ధి చేసే నాయకులకు ప్రజలు పట్టం కట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమీషనర్ షేక్ మహమూద్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,మాజీ జెడ్పీటీసీ అశోక్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రేష్మ బేగం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్,గోరటి శ్రీనివాసులు,రవీందర్ బాలు నాయక్,నాయకులు మల్లెపల్లి జగన్, గోపిరెడ్డి చిన్న రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,సైదులు, శేఖర్, చంద్రకాంత్ రెడ్డి,సోఫీ,ఆరీఫ్, దున్న సురేష్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల పాఠశాలలో కిషోర రక్షా హెల్త్ కార్యక్రమం



వర్ధన్నపేట ,ఆగస్టు 04 (మనంన్యూస్): మండలంలోని ఇల్లంద గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఉపకేంద్రం ( 1 )ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 48 మందికి రిఫరల్, హెచ్ బి,వెయిట్,బిపి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జునేద్ ఖాన్ , పల్లె డాక్టర్ కమల్ కిషోర్, సి హెచ్ ఓ జ్ఞానసుందరి,సూపర్వైజర్ రాజు, స్వర్ణకుమారి గ్రామ కార్యదర్శి రామారావు, ఏఎన్ఎం లు సరోజ, రమాదేవి, అపరంజి, ఆశ కార్యకర్తలు,పాఠశాల ఎస్ఓ కరుణశ్రీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విన్నపాలు పరిష్కరించాలి



- నాగర్ కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అమరేందర్
- ప్రజావాణి కి 38 ఫిర్యాదులు

నాగర్ కర్నూల్, ఆగస్టు 04 (మనం ప్రతినిధి) : ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అమరేందర్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అదనపు కలెక్టర్ కు తమ అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీదారుడు సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా జిల్లా అధికారులు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రజావాణికి 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు రవికుమార్, వెంకట్, శోభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



జగిత్యాల, ఆగస్టు 04 ( మనం న్యూస్): ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా జగిత్యాల పట్టణంలోని కావేరీ హాస్పిటల్ లో జగిత్యాల ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ సిడిపిఓ మమత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మమత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్ట్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలపడం జరిగింది. పుట్టిన ప్రతి బిడ్డకు ఒక గంట లోపు ముర్రుపాలు తాగించాలి అని, ఈ ముర్రు పాలు తాగించడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బిడ్డకు అది ' మొదటి టీకా' అనే పాలలో' కొలెస్ట్రామ్' అనే విటమిన్ ఉంటుందని, 'లాక్టోస్' అని తీయని పదార్థం ఉంటుందని, బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డకు ప్రేమ అనుబంధం పెరుగుతుందని, ఆరోగ్యం మరియు తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని, ఆరు నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఏ ఇతర పదార్థాలు ఇవ్వరాదని, బిడ్డ కోరినన్నిసార్లు పాలు ఇవ్వాలని, తల్లి ఎప్పుడూ బిడ్డకు కూర్చుని బిడ్డకేసి చూస్తూ మాత్రమే పాలు ఇవ్వాలని తెలపడం జరిగింది.మరియు బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలి. ఆరు నెలలు దాటిన తర్వాత అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే బాలామృతంతో పాటు ఇంటిలో తయారుచేసిన అన్నము ఉడికించి నెయ్యి వేసి తినిపించవలెనని, రెండు సంవత్సరంల వరకు బిడ్డకు తల్లిపాలు కొనసాగించవలెనని, తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది.

బిడ్డకు సరిపడా పాలు రావాలన్నా కూడా తల్లి మంచి ఆకుకూరలు, పోషకాలతో కూడినటువంటి కూరగాయలు, పప్పు, తృణధాన్యాలు, చిరుధాన్యాలు ఎక్కువ తీసుకుంటే బిడ్డకు సరిపడా పాలు వస్తాయని తెలపడం జరిగింది. అనంతరం మోతె గ్రామము లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీ లకు, సీమంతం, పిల్లలకు అన్నప్రాసన చేయడం జరిగింది. బాలింతలకు, గర్భిణీలకు, తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డా,, మోర రోజా, పిల్లల వైద్య నిపుణులు డా,, మోర సుమన్ కుమార్, సూపర్వైజర్ లు రాజశ్రీ, కవిత, నిర్మల, స్వరూప, షైనీ, లావణ్య, భాగ్యలక్ష్మి,అంగన్వాడీ టీచర్స్ శారద, సుమలత, అంబాలిక, ఏఎన్ఎమ్ జయమ్మ, పంచాయతీ సెక్రటరీ కృష్ణచైతన్య, గర్భిణిలు , బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే సంపూర్ణతా అభియాన్ అవార్డు



- సంపూర్ణత అభియాన్ రాష్ట్ర అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.కు
- టి.జి.ఓ.లు ములుగు జిల్లా ఘన సన్మానం

ములుగు, ఆగస్టు4, మనం ప్రతినిధి: సమిష్టి కృషితోనే సంపూర్ణ తా అభియాన్ లో రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించామని జిల్లా కలెక్టర్ టి.ఎస్. తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ , తెలంగాణ ఆధ్వర్యంలో ఆగస్టు 2న హైదరాబాద్రాజ్భవన్లోనిర్వహించిన 'సంపూర్ణత అభియాన్ రాష్ట్ర స్థాయి అవార్డుల కార్యక్రమం' లో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకోవడం మన జిల్లా కు గర్వకారణం. ఇది ఒక వ్యక్తిగత విజయంగా కాకుండా, అందరి సమిష్టి కృషి ఫలితంగా సాధించగలిగిన గొప్ప విజయంగా భావిస్తున్నాను. ఇదే స్ఫూర్తితో అందరూ సమన్వయం తో కలిసి పనిచేస్తూ, జిల్లాను అభివృద్ధి మార్గంలో ముందుకు నడిపిద్దామని అన్నారు. అదే కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఖీఎటై ములుగు జిల్లా అధ్యక్షులు కూడా సంఘం తరపున సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ

'పనినే పరమావధిగా భావించి, అంకితభావంతో పనిచేస్తే సేవకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవోజిల్లా కార్యదర్శి కందుల జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాశ్ రెడ్డి, ఉపాధ్యక్షులు దేవరాజ్, కొమురయ్య, శిరీష, రాజు, విజయభాస్కర్, శైలజ, యశ్వంత్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అద్దె భవనాల్లో రిజిస్టర్ కార్యాలయం ఇంకెనాళ్లు ?

## ముప్పై ఏళ్లుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న మహబూబ్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం

- కలెక్టర్ కార్యాలయానికి పట్టా భవనం
- రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అద్దె భవనం






మహబూబ్ నగర్ , ఆగస్టు 4 (మనం న్యూస్ ): అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా మహబూబ్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి ఏర్పడింది రిజిస్ట్రేషన్ల ద్వారా లక్షల్లో ఆదాయం వస్తున్నా.. కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తిప్పలు పడుతున్నారు. కార్యాలయానికి శాశ్వత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తుండగా.. సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. జిల్లాలో చిన్న తిరుపతి గా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వెంకటేశ్వరునికి నిలయంగా ఉన్న మన్నెంకొండ, మహబూబ్ నగర్, దేవరకద్ర, భూత్పూర్, జడ్చర్ల, నవాబుపేట మరియు పరిసర ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రిజిస్ట్రేషన్లకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. కార్యాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో ఇరుకు గదుల్లో కార్యకలాపాలు నెట్టుకొస్తున్నారు. ప్రజలు సరైన కుర్చీలు లేక చంటి పిల్లలతో రిజిస్ట్రేషన్ ఆఫీస్ కి వచ్చేవారు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మూడు కుర్చీలు మినహా పెద్ద సౌకర్యాలు ఏమీ లేకపోవడంతో చంటి పిల్లలను ఎత్తుకొని తమ పనులు కష్టమైనా ముగించుకోవాలిసిన పరిస్థితి దాపురించింది అని ఆవేదన చెందుతున్నారు. అద్దె భవనంలో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

**పార్కింగ్ లేక వాహనదారులకు తిప్పలు...**

రిజిస్ట్రేషన్ కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తమ వాహనాలను ఎక్కడ పెట్టాలో అర్థం కాక రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో ఈ రోడ్డంతా ట్రాఫిక్ తో నిండిపోవడంతో ఇటువైపుగా వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. కార్యాలయానికి వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి కుర్చీలు సైతం లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ఉండాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ రుసుము చార్జీలు పెంచిన ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరం. ప్రశాంతమైన వాతావరణంలో కలెక్టర్ కార్యాలయం లో పలు శాఖలు విధులు నిర్వహిస్తుంటే ప్రతిరోజు వందల సంఖ్యలో వచ్చే రిజిస్ట్రేషన్ కార్యాలయం మాత్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని కార్యాలయానికి వచ్చే ప్రజల గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే నూతన భవనాన్ని ఏర్పాటు చేసి వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని వినియోగదారులు, పాలమూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు..



వేములవాడ ఆగస్టు 04 (మనం న్యూస్): శ్రావణ మాసం రెండవ సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచే క్యూలైన్లలో నడుచుకుంటూ స్వామివారి దర్శనానికి భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు.సాయంత్రం 6:15 గంటల వరకు మొత్తం 44,990 మంది భక్తులు స్వామివారి దర్శన భాగ్యం పొందారని ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాబాయి తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో నిండి సందడి వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.శ్రావణ మాసం మిగిలిన సోమవారాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# పేదలకు వరం పీఎం కిసాన్ పథకం

- చేవెళ్ల మున్సిపల్ భాజపా అధ్యక్షుడు అనంత్ రెడ్డి



చేవెళ్ల, ఆగస్టు 4(మనం న్యూస్ ): పేదలకు వరం కిసాన్ సమ్మాన్ నిధి పథకం అని చేవెళ్ల మున్సిపల్ భాజపా అధ్యక్షులు అనంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా రైతులకు ఆర్థికంగా చేయూతనివ్వడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పథకం కింద రైతులకు ప్రతి నాలుగు నెలలకు రూ. 2,000 చొప్పున, ఏడాదికి మొత్తం రూ. 6,000లు కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. ఈ డబ్బులను రైతులు వ్యవసాయ అవసరాలకు, కుటుంబ అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే దేశవ్యాప్తంగా కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ పథకం రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోందనీ వివరించారు. చేవెళ్ల నియోజకవర్గం రైతుల తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలగాలి



- జిల్లా ఎస్పీ డి. జానకి..

మహబూబ్ నగర్,ఆగస్ట్ 04 (మనం న్యూస్): ప్రజలకు పోలీస్ వ్యవస్థ పై నమ్మకం కలగాలని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో పోలీస్ సేవల ప్రమాణాలను పరిశీలిస్తూ, జిల్లా ఎస్పీ డి. జానకి, హన్వాడ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఫిర్యాదు రిజిస్టర్లు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు, ఆయుధాల భద్రత, మేనువల్ డిజిటల్ రికార్డుల పరిశుభ్రత మరియు ఇతర స్టేషనరీ అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ఎస్పీ పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, వారి బాధ్యతల నిర్వహణ, డ్యూటీ నిబద్ధత, పౌరులతో శుభ్రతా సంభాషణ, మహిళా భద్రత, రాత్రి గస్తీ విధులు, మానవత్వ పరమైన వైఖరిపై సూచనలు, మార్గనిర్దేశనలు చేశారు. ప్రజల విశ్వాసం పోలీసు వ్యవస్థపై నిలవాలంటే ప్రతీ కానిస్టేబుల్, ఎస్ఐ స్థాయి నుండి పై అధికారుల వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టంగా తెలియజేశారు. ప్రజల సమస్యలపై స్పందన త్వరగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్ నగర్, ఆగస్టు 4(మనం బ్యూరో): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 96 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.సి. ఈ ఓ వెంకట రెడ్డి,అర్ డి. ఓ నవీన్,గృహ నిర్మాణ పి.డి.వైద్యం భాస్కర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వన మహోత్సవం**

**కార్యక్రమం లక్ష్యాలు సాధించాలి....**

వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటే లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమన్వయ సమావేశం లో కలెక్టర్ వన మహోత్సవం వివిధ అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా లక్ష్యం 58 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 63 శాతం మొక్కలు నాటి రాష్ట్రంలో 12 వ స్థానంలో ఉందని తెలిపారు.వివిధ శాఖల వారీగా మొక్కల లక్ష్యం, సాధించిన ప్రగతి కలెక్టర్ సమీక్షించారు.ముఖ్యంగా మహబూబ్ నగర్,జడ్చర్ల,భూత్పూర్ మున్సిపాలిటీలలో మొక్కలు నాటే లక్ష్యం లో ఆశించిన ప్రగతి లేదని తెలిపారు.మున్సిపాలిటీలలో మొక్కలు నాటే లక్ష్యం వేగంగా పూర్తి చేయాలని,కావలసిన మొక్కలు ఇండెంట్ ఇస్తే డి.అర్.డి. ఓ నుండి సరఫరా చేస్తారని తెలిపారు.పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాలు,రెసిడెన్షియల్ పాఠశాలలు,కళాశాలల్లో ఖాళీగా ఉన్న స్థలంలో మొక్కలు నాటాలని,ఎం.పి.డి. ఓ లు,మండల ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని అన్నారు.40 వేల ఈత మొక్కలు ఉన్నాయని,ఎక్సైజ్ శాఖ ఈత మొక్కలు నాటించాలని అన్నారు. వెదురు,శ్రీ గంధం,నేరేడు, మామిడి మొక్కలు అటవీ శాఖ నర్సరీల్లో అందుబాటులో ఉన్నట్లు,వ్యవసాయ,ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖలు రైతుల నుండి ఇండెంట్ ఇస్తే సరఫరా చేయనున్నట్లు తెలిపారు.గత సంవత్సరం నాటిన మొక్కలు చనిపోయిన చోట కొత్త మొక్కలు నాటాలని,మొక్కలు నాటడం తో పాటు వాటిని వృక్షాలుగా పెరిగేలా బతికించాలని అన్నారు .నాటిన మొక్కలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేసి అప్డేట్ చేయాలని ఆయా శాఖలను కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డి ఎఫ్. ఓ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్ సామాజిక ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

- సూపరింటిండెంట్, డ్యూటీ డాక్టర్‌కు షోకాష్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం



**కామారెడ్డి, ఆగష్టు 04 (మనంప్రతినిధి) :** విధులలో నిర్లక్ష్యం వహించిన జుక్కల్ సామాజిక ఆసుపత్రి సూపరింటిండెంట్, డ్యూటీ డాక్టర్‌కు షోకాష్ నోటీస్ ఇవ్వాలని డిసిహెచ్‌ఎస్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా జుక్కల్ మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది డ్యూటీ రిజిస్టర్ ను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్, డ్యూటీ డాక్టర్ డాక్టర్ విట్టల్ లు అందుబాటులో లేకపోవడంతో అగ్రహం వ్యక్తం చేసి వర్షాకాలం అనేక వ్యాధులతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలు కొరకు వస్తూ ఉంటారు ఇలాంటి సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోతే పేద ప్రజలకు ఎవరు వైద్యం చేస్తారని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ కు మరి డ్యూటీ డాక్టర్ కు షోకాజ్ నోటీస్ అందించాల్సిందిగా డి. సి. యచ్, ఎస్ డాక్టర్ విజయలక్ష్మిని జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జుక్కల్ తాసిల్దార్ తదితరులు ఉన్నారు.

# రెంజల్‌లో మండలంలో పర్యటించిన కలెక్టర్

**నిజామాబాద్, ఆగష్టు 04 (మనం బ్యూరో) :** రెంజల్ మండలంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సోమవారం విస్తృత పర్యటన చేపట్టారు. ముందుగా వీరన్నగుట్ట జెడ్పీహైస్కూల్తోపాటు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ విధానంలో హాజరు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతులపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, కిచెన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. అనంతరం పీహెచ్సీ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. పీహెచ్సీలో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంగన్వాడీ కేంద్రంలోనూ టీచర్ లేకపోవడంతో చర్యలు తీసుకోవాలని సీడీపీఓను ఫోన్లో ఆదేశించారు. అలాగే సహకార సంఘం ఎరువుల గోడౌన్లో ఎరువుల నిల్వలు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. పీఆర్, ఆర్డబ్లుఎస్, ఆర్అండ్బీ, తదితర ఇంజనీరింగ్ విభాగాల ఏఈల క్షేత్రస్థాయి సందర్శనల వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో మూవ్మెంట్ రిజిస్టర్ నిర్వహించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో దీన్ని అమలుపర్చాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై గ్రామం వారీగా సమీక్ష జరిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఆగష్టు 04 (మనం ప్రతినిధి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే



పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 142 అర్జీలను సమర్పించారు. ఫిర్యాదుదారుల నుండి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, లోకల్ బాడీస్ చందర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికి నుల్లి పురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్, ఆగష్టు 04 ( మనం బ్యూరో) :** జిల్లాలోని ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో డీవార్మింగ్ డే కార్యక్రమంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., 19 ఏళ్ల వయసు లోపు విద్యార్థులందరికీ మాత్రలు వేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు, బడిబయట పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో కళాశాలలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. భోజనం తిన్న తర్వాత ఈ మాత్ర వేయాలన్నారు. ప్రధానంగా రక్తహీనత, బరువు తగ్గుదల తదితర వ్యాధుల నుంచి కాపాడడానికి మాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మైకుల ద్వారా పట్టణాల్లో చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 9, 10వ తేదీల్లో రెండు రోజులపాటు తప్పనిసరిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనాథ బాలల ఆశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, రెస్క్యూ హోంలలో కూడా డీవార్మింగ్ డేను నిర్వహించాలని సూచించారు. 11వ తేదీన మాత్రలు ప్రతి విద్యార్థికి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థులకు అందకపోతే మలివిడతగా 18వ తేదీన వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు వయసు కలిగిన వారు సుమారు 4.05 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, అదనపు కలెక్టర్ అంకిత్, డీపీవో శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అశోక్, డీడబ్ల్యూవో రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుంది



- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు

**జుక్కల్, ఆగష్టు 04 (మనం న్యూస్) :** విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు అన్నారు. జుక్కల్ నియోజకవర్గం డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., విద్యార్థులకు షూ డొనేట్ చేసిన శివరాజ్ పటేల్ కి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుందని అన్నారు. విద్యార్థి దశ అతి ముఖ్యమైనదని, విద్యార్థులందరూ బాధ్యతగా విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వ్యక్తిత్వ వికాసానికి, వ్యక్తి పురోగతికి, సమాజం మరియు దేశ అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎంతో శ్రద్ధ, బాధ్యతతో పాఠాలు బోధిస్తూ వారి భవిష్యత్ కు బంగారు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలకు సంబంధించి ప్రహరీ గోడ, అదనపు తరగతి గదులు నిర్మిస్తామని,ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభించే నాటికే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువారాలని కోరారు. విద్యార్థులకు విద్యా బుద్ధులతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విధంగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా గ్రామ పెద్దలు కూడా పాఠశాలలో చిన్న చిన్న సమస్యలు ఉంటే బాధ్యతగా ముందకు వచ్చి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయం- అంతర్జాతీయం

# అమెరికాలో పెట్టుబడులకు భారతీయులు సై..!

**వాషింగ్టన్, ఆగష్టు 4 :** అగ్రరాజ్యం అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు బాగా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని డేటా చెబుతోంది. త్వరలో వీటిని ట్రంప్ ప్రకటించిన గోల్డ్ కార్డులతో భర్తీ చేయనున్న విషయం తెలిసిందే.

తాజాగా ఈబీ-5 దరఖాస్తులకు సంబంధించిన డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు దీనికోసం ఏడాది వ్యవధిలో దరఖాస్తు చేసుకొన్నట్లు అర్థమవుతుంది. గతేడాది ఏప్రిల్ 2024 నుంచి భారతీయుల్లో దీనికి ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా ''2025 ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2024 నుంచి జనవరి 2025)లో భారతీయుల నుంచి 1,200కు పైగా ఐ-526ఈ పిటిషన్లు వచ్చాయి'' అని యూఎస్ఐఎఫ్ సీఎంవో నికోలస్ మాస్ట్రోన్నీ-3 పేర్కొన్నారు.

ఇతర రకం వీసాల జారీలో పెద్దసంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డుల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ వద్ద దాదాపు 1.1 కోట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే




ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకొన్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ డేటా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయులకు 1,428 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే. అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం అక్కడి ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసింది. తాజాగా యూఎస్ సిటిజన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వీటిని ప్రకటించింది. కుటుంబసభ్యులకు జారీ చేసే ఇమిగ్రెంట్ వీసాలకు కూడా స్క్రీనింగ్, వెట్టింగ్ ప్రక్రియను కఠినతరం చేసింది. అనర్హమైన అప్లికేషన్లు తొలగించేందుకు దీనిని చేపట్టినట్లు ప్రకటించింది.

యూఎస్సీఐఎస్ సంస్థ మరింత పకడ్బందీగా అర్హమైన వివాహాలను, సరైన కుటుంబసంబంధాలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించింది. దీంతోపాటు అవసరమైన చట్టాలను పాటిస్తున్నారని ధ్రువీకరించుకొనేందుకు ఇది అవసరమని భావించారు. ఇక జాతీయ భద్రతకు ఇబ్బందిలేకుండా ఇబ్బందికర వ్యక్తులను గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటిని పెండింగ్‌లో ఉన్న, కొత్తగా దరఖాస్తు చేసుకొన్న వాటికి వర్తింపజేయనున్నారు.

నకిలీ వివాహాలు చేసుకొని అమెరికాలోకి ప్రవేశించే వారిని అరికట్టడం కూడా దీని లక్ష్యం. ఇకనుంచి వివాహాలకు సంబంధించి అధికారులకు మరింత సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో జాయింట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్, ఫొటోగ్రాఫ్, మిత్రులు, బంధువుల నుంచి అభినందన పత్రాలు వంటివి ఉన్నాయి. దీంతోపాటు వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. స్పాన్సర్ గతంలో ఎవరికైనా స్పౌస్‌ల వీసాలు జారీ చేసినా.. ఇమిగ్రేషన్ రికార్డుల్లో తేడాలు ఉన్నా వాటిని యూఎస్సీఐఎస్ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతుంది.

# అణు బెదిరింపుల అప్రమత్తత అవసరం

- రష్యా

**మాస్కో, ఆగష్టు 4 :** రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ నౌకాదళాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రష్యా స్పందిస్తూ.. తమ వద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని పేర్కొంది. తాజాగా ఈ విషయంపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ.. అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించడంపై తాము మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. అణు బెదిరింపుల విషయంలో ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.



ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ త్వరలో మాస్కోలో పర్యటించనున్న నేపథ్యంలో దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విట్కాఫ్ పర్యటనపై మాట్లాడుతూ.. ఆయన్ను మాస్కోకు ఆహ్వానించడానికి తాను ఎదురు చూస్తున్నానన్నారు. అటువంటి వారితో సంబంధాలు మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యమైన విషయంగా భావిస్తున్నట్లు తెలిపారు. వీలైతే ఆయన పుతిన్‌తోనూ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

కాగా ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజుల్లో ముందుకు రావాలని రష్యాకు హెచ్చరికలు చేశారు. దీంతో ఆగ్రహించిన మాస్కో మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ రష్యా వద్ద సోవియట్ యూనియన్ హయాం నాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. దీంతో ఆ దేశానికి చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ఆదేశించారు. ''ఒకవేళ మెద్వెదేవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ముఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాంటివి జరగవని ఆశిస్తున్నా'' అని తెలిపారు.

## చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు? కేంద్రానిది 'డీడీఎల్జే' పాలసీ

### కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శ

**ఢిల్లీ, ఆగష్టు 4 :** కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని.. మన భూభాగంలోకి ఎవరూ



చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' (డినై,డిస్ట్రాక్,అబద్ధంచెప్పు, సమర్థించు) అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు.

జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులైనా సృష్టించగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.

# చైనా ఆక్రమించిందని మీకెలా తెలుసు?

- రాహుల్ గాంధీకి ప్రశ్నించిన సుప్రీం కోర్టు

**ఢిల్లీ, ఆగష్టు 4 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరని వ్యాఖ్యానించింది. రాహుల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న సమస్యలను ప్రశ్నించకపోతే రాహుల్ ప్రతిపక్ష నాయకుడు ఎలా అవుతారని వాదించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఏదైనా సమస్య లేదా విషయంపై మాట్లాడాలంటే పార్లమెంటులో మాట్లాడాలని.. సోషల్ మీడియాలో కాదని పేర్కొంది. ఇటువంటి సమస్యలను పార్లమెంటులో ఎందుకు లేవనెత్తరని ప్రశ్నించింది. 2022లో దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా



రాహుల్‌గాంధీ మాట్లాడుతూ..పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''2020 జూన్లో లడఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన హింసాత్మక ఘర్షణ సమయంలో దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. ఇది ఢిల్లీ వైశాల్యం కంటే ఎక్కువ. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్నవారు దాని గురించి ఒక్క ప్రశ్న కూడా అడగరు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ భూభాగాన్ని తిరిగి ఇవ్వాలంటూ మన సైన్యం చైనా సైన్యంతో చర్చలు జరిపినప్పటికీ ప్రధాని మోడీ ఈ విషయంలో అబద్ధాలు చెబుతున్నారు.. ఆక్రమణే జరగలేదంటున్నారు. దీని గురించి దేశ మీడియా ప్రశ్నించడం లేదు. ఇది నిజం కాదా..? ఇదంతా యావత్ దేశం గమనిస్తోంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో రాహుల్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దేశ సైన్యాన్ని అవమానించేలా మాట్లాడారని ఆరోపిస్తూ 2022లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశారు.

# నెతన్యాహుపై ఒత్తిడి తీసుకురండి

### ట్రంప్‌నకు ఇజ్రాయెలీ మాజీ అధికారుల లేఖ

**జెరుసలెం, ఆగష్టు 4 :** ఇజ్రాయెల్- హమాస్ యుద్ధంతో గాజాలో పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే 60వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. స్థానికంగా ఆకలి కేకలు మిన్నంటాయి. ఈ పరిణామాల నడుమే.. గాజాలో యుద్ధాన్ని ఆపేలా ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తీసుకురావాలని ఇజ్రాయెల్‌కు చెందిన దాదాపు 600 మంది విశ్రాంత భద్రతా అధికారులు, నిఘా సంస్థల మాజీ అధిపతులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖ రాశారు. హమాస్ ఇకపై తమ దేశానికి వ్యూహాత్మక ముప్పు కాదని.. వృత్తిపరమైన అనుభవంతో ఇది చెబుతున్నట్లు పేర్కొన్నారు.



హమాస్‌ను పూర్తిస్థాయిలో ఓడించడం ద్వారానే బందీలను విడిపించేందుకు నెతన్యాహు కృషి చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఇది కాస్త.. గాజాలో మరిన్ని దాడులకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కాల్పుల విరమణకు ఒత్తిడి తీసుకొస్తున్న మిత్రదేశాలను ఈ పరిణామాలు మరింత ఆగ్రహానికి గురిచేయొచ్చని అంచనా వేస్తున్నారు. బందీల కుటుంబాలకు మద్దతుగా నిలుస్తున్న ఓ గ్రూప్ సైతం.. సైనిక కార్యకలాపాల విస్తరణ ఆలోచనలను ఖండించింది. ఇజ్రాయెల్‌ను, బందీలను నెతన్యాహు వినాశనం వైపు నడిపిస్తున్నారని మండిపడింది. ట్రంప్‌నకు రాసిన లేఖలో.. మొసాద్ మాజీ చీఫ్ తామీర్ పార్డో, షిన్ బెట్ మాజీ చీఫ్ అమీ అయలోన్, మాజీ ప్రధాని ఎహుద్ బరాక్, రక్షణశాఖ మాజీ మంత్రి మోషే యాలోన్ తదితరులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అన్ని సైనిక లక్ష్యాలను సాధించినప్పటికీ.. యుద్ధాన్ని కొనసాగించడంపై అయలోన్ విమర్శలు గుప్పించారు.

''నెతన్యాహును, ఆయన ప్రభుత్వాన్ని సరైన దిశలో నడిపించే సామర్థ్యం మీకు ఉంది. గాజా యుద్ధాన్ని ముగించండి. లెబనాన్‌లో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. గాజా విషయంలోనూ చొరవ చూపాల్సిన సమయం ఆసన్నమైంది. బందీలను విడిపించేలా చర్యలు తీసుకోండి'' అని విశ్రాంత ఐడీఎఫ్ జనరల్స్, మొసాద్, షిన్ బెట్ అధికారులు, పోలీసులు, దౌత్యాధికారులతో కూడిన 'సీఐఎస్' గ్రూప్ ట్రంప్‌నకు రాసిన లేఖలో పేర్కొంది. ఒకవైపు బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ వీడియోలు విడుదల చేయడం.. మరోవైపు గాజాలో దాడులను మరింత విస్తరించేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారనే నివేదికల నడుమ ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఫోన్ రికవరీ చేయడంలో పోలీసు సిబ్బంది ఎంతో కృషి

- పోలీసు శాఖ ప్రజల కోసమే సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- సామాన్యులకు పోలీసులు ఎప్పుడు మిత్రులే
- మోసాలు నేరాలు చేసే వారిపట్ల మాత్రమే కఠినంగా వ్యవహరిస్తాం
- జిల్లా ఎస్పీ నరసింహ





**సూర్యాపేట ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న ఫోన్స్ ను జిల్లా పోలీసులు పటిష్ఠంగా పని చేసి 101 చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు, దీనిలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 101 ఫోన్ల ను ఎస్పీ నరసింహ చేతుల మీదుగా బాధితులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ...ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ శరీరంలో బాగమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం, జ్ఞాపకాలు పదిలం చేసుకోవడం కోసం, బ్యాంక్ అకౌంట్ నిర్వహణకోసం, సోషల్ మీడియా కోసం వినియోగిస్తున్నాం అన్నారు, మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది కావున మొబైల్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పీ సూచించారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసాలు, గంజాయి వల్ల జరిగే అనర్ధాలు, అసంఘిక కార్యకలాపాల గురించి వివరించి ఇక్కడ ఉన్నవారు మీ చుట్టూ ఉన్న వ్యక్తులకు అవగాహన కల్పించాలి అని కోరారు. పోలీసులు ప్రజల రక్షణకోసం ఉన్నార్, పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి, సమస్యలపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల రక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సామాన్యులకు పోలీసులు మిత్రులు, నేరాలకు పాల్పడేవారు పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అన్నారు.జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను సి ఈ ఐ ఆర్. అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించారు. ఇతర రాష్ట్రాల నుండి ఫోన్స్ రికవరీ చేయడం జరిగినది అన్నారు.

**కృతజ్ఞతలు వ్యక్తం చేసిన బాధితులు...**

జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితులు పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరికినందుకు, ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. బాగా పని చేస్తున్నారు అని అభినందించారు.

**సైబర్ మోసగాళ్ల నుండి జాగ్రత్తలు పాటించాలి...**

ప్రస్తుతం మొబైల్ ద్వారా అన్ని బ్యాంక్ లావాదేవీలు జరుగుతున్నాయని, సోషల్ మీడియా అకౌంట్స్ నిర్వహిస్తున్నము, వ్యక్తిగత ఫోటోలు ఉంటున్నాయి ఫోన్ ను ఎవరైనా దొంగలించి మన సమాచారం తస్కరించి నష్టం చేసే అవకాశం ఉన్నది అని ఎస్పీ గారు అన్నారు. మొబైల్ ఫోన్కు పంపించే బ్లూ లింకులను అనుసరించవద్దు, వ్యక్తిగత వివరాలు ఎవరైనా అడిగితే వారికి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు తెలపవద్దు అని స్పష్టం చేశారు. బహుమతులు వచ్చాయి ప్రాసెస్ ఫీజు చెల్లించండి, తక్కువ ఇంట్రెస్ట్ కు లోన్ ఉన్నది ప్రాసెస్ ఫీజు చెల్లించండి అంటే ఇలాంటి మాయమాటలు ఎవరు నమ్మవద్దు ఇలాంటి వాటి వెనుక సైబర్ మోసగాళ్లు ఉంటారనేది గుర్తించండి అని తెలిపినారు. గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు పై సమాచారం ఇవ్వాలి.ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఐటి.కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి**

జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కొచ్చే అర్జీలను వెంటనే పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. సోమవారం ప్రజావాణి దరఖాస్తుల స్వీకరించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ...శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాధిత

పిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కారం చూపి బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

# పూర్వవిద్యార్థికి ఆర్థిక సాయం



**తిరుమలగిరి, ఆగస్టు04మనం న్యూస్:** మండల కేంద్రంలోని తాటిపాముల గ్రామానికి చెందిన మొల్గూరి రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురై బ్రెయిన్ సర్జరీ తో నెల రోజులపాటు నిమ్స్ ఆసుపత్రిలో చావు బ్రతుకులతో కొట్టుమిట్టాడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న 2007-08 బ్యాచ్ చెందిన అప్పటి పదవతరగతి స్నేహితులంతా కలిసి స్నేహం కంటే ఈ లోకంలో గొప్పదేదిలేదనీ తమ వంతు బాధ్యతగా అండగా ఉంటామని రమేష్ కు భరోసాని 31 మంది రూ.15500లు సోమవారం అందజేశారు. ఈ మధ్యకాలంలోనే ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయి హైదరాబాదులోని అద్దె గృహంలో నివాసముంటున్న రమేష్ కు స్నేహితులు పరామర్శించి, మిత్రులు తోచిన ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు మాట్లాడుతూ ఆరోగ్యం కుదుటపడేంతవరకు చికిత్సకు సహకరిస్తామని, ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు యాకస్వామి, పెరుమాండ్ల ప్రశాంత్, ఇట్టబోయిన కుమారస్వామి, ఎర్ర భాష, మహేష్ , ముత్తయ్య, పాక యాకన్న, ఐల ఉపేందర్, రాజ్ కుమార్, మధు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు వెంటనే పరిష్కారం

- అల్బండాజోల్ టాబ్లెట్ ద్వారా పిల్లలలో నులిపురుగుల నివారణ
- నిరుద్యోగులకి డి ఈ ఈ టి పోర్టల్ ద్వారా ఉద్యోగ సమాచారం
- అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** అల్బండాజోల్ టాబ్లెట్ తీసుకోవటం ద్వారాపిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి పిల్లలలో బలహీనత, రక్తహీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు లోనవుతారని ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 11 న 'జాతీయ డీవార్మింగ్ డే' నిర్వహిస్తుందని తెలిపారు. డి ఈ ఓ, డి ఎం హెచ్ ఓ, డి డబ్ల్యు ఓ, రెసిడెన్సీయల్ కో ఆర్డినేటర్లు సమన్వయము చేసుకుంటూ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, హాస్టల్ వార్డెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో,రెసిడెన్సీ యల్ హాస్టల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి వైద్య సిబ్బంది ద్వారా అల్బండాజోల్ మందులు అందించాలని ఆదేశించారు.నిరుద్యోగ యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగ సమాచారం కొరకు డి ఈ ఈ టి (డిజిటల్ ఎంప్లయ్ మెంట్ ఎక్స్చేంజి ఆఫ్ తెలంగాణ ) అనే ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. తదుపరి పోస్టర్ ని ఆవిష్కరించారు.జిల్లా అధికారులు తమ శాఖ అభివృద్ధి పనులపై అలాగే తమకి కేటాయించిన హాస్టల్స్ పాఠశాలలను తరువుగా క్షేత్ర స్థాయి లో పరిశీలించి తమకి నివేదిక అందచేయాలని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య లకి సంబంధించి 57 ధరఖాస్తులు, ఎంపిడిఓ లకి 12 ధరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకి 7 ధరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారికి 6 దరఖాస్తులు మిగిలిన 17 ధరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవి వచ్చాయని, మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించుట కొరకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని వెల్లడించారు.ఈ కార్యక్రమం లో డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి ఆర్ డి ఎ పిడి వివి అప్పారావు, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

## దొండపాడు గ్రామంలో పోతురాజు విగ్రహం ప్రతిష్ఠ



**చింతలపాలెం ఆగస్టు 4 (మనం న్యూస్):** చింతలపాలెం మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో నూతన ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం , పోతురాజు విగ్రహం ప్రతిష్ఠ,నూతన ఆలయ ప్రారంభ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగాయి. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామం, మాలపల్లి కాలనీకి చెందిన భక్తుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో పూజలు జరిపి. గ్రామస్థుల సహకారంతో డబ్బును సమకూర్చి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన ఆలయం నిర్మించామని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వేద పండితులు నార్ల శాండిల్య శర్మ గారు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, విగ్రహ దాత గోపిరెడ్డి పుల్లారెడ్డి, రేలా చిన్న వెంకటరెడ్డి గార్లు, మాజీ డిసి చైర్మన్ అన్నపరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి పాత ముత్యాలమ్మ గుడి చైర్మన్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రామాలయం గుడి చైర్మన్ చింతగుంట్ల శాంతారెడ్డి మదిర సత్యానారాయణ, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ పెట్రోలింగ్ తనిఖీలు నిరంతరంగా చేయాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి
- రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని పని చేయాలి
- పాత నేరస్తులు సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవ్యక్తుల కదలికలపై నిఘా
- సామాజిక అంశాల పై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పి నరసింహ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ నందు ముందుగా సిబ్బంది పరేడ్ ను పరిశీలించారు. డిఎస్పీ ప్రసన్న కుమార్, సి ఐ.రాజశేఖర్, యస్ ఐ.బాలు నాయక్, స్టేషన్ సిబ్బంది స్వాగతం తెలిపినారు. పరికరాలు పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు, అనంతరం స్టేషన్ రికార్డ్స్, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ మ్యాప్ ను, గ్రామాల హద్దులను, కేసు ఫైల్స్ ను, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించారు. ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని పని చేయాలి రౌడి షిటర్స్, సస్పెక్ట్ పై, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలి అన్నారు. స్టేషన్ పరిధిలో గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో పెట్రోలింగ్, తనిఖీలు నిరంతరంగా చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఉండకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి, మహిళా కేసుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలి. ప్రతి విషయమును రికార్డ్ లో నమోదు పరచాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు క్షుణ్ణంగా చేయాలి, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి అన్నారు. సామాజిక అంశాలు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ, సి సి కెమెరాల ఏర్పాటు మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో డి సి ఆ బి ఎస్ ఐ.యాకూబ్, డి సి ఆ ర్ బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎస్పి సీసీ సందీప్ ఉన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవి




**చిలుకూరు, ఆగస్టు 4 (మనం న్యూస్):** పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమని ప్రాథమిక వైద్యశాల ఆయుష్ వైద్యురాలు సుశీల, సిడిపిఓ వెంకటలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో బాలింతలకు, గర్భిణీలకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పండ్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి సూపర్వైజర్ సునీత, టీచర్లు సిరికొండ కవిత, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది





**తుంగతుర్తి, ఆగస్టు 4( మనం న్యూస్ ):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహశీల్దార్ దయానందం అజ్ఞారు. సోమవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు జీవకోటికి ప్రాణాధారమని, వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంటికి ఆరు మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషు కుమార్, సీడీపీఓ శ్రీజ, ఎంపీఓ సందీప్, ఏపీఓ కృష్ణయ్య, కార్యదర్శి మడిపెద్ది శ్రీనివాస్, ఫీల్ అసిస్టెంట్ నాగరాజు, మెట్లు వెంకటేష్, నాగమల్లు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథకాలు అమలుకు నోచుకోని మా గ్రామం

## దళిత ఎమ్మెల్యేలు నాలుగు పర్యాయాలు పరిపాలించిన గ్రామంలో అభివృద్ధి శూన్యం

## లేదంటే స్థానిక సంస్థలను బహిష్కరిస్తాం

## కలెక్టర్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి రావులపల్లి నుండి పాదయాత్రగా వెళ్ళిన సామాజిక కార్యకర్త చింతయ్య




**తుంగతుర్తి, ఆగస్టు 4,(మనం న్యూస్):** ఎస్సీ నియోజకవర్గమైన తుంగతుర్తిలో నాలుగు పర్యాయాలు పరిపాలించిన దళిత ఎమ్మెల్యేలు మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో అభివృద్ధి మరిచారని సామాజిక కార్యకర్త చింతకుంట్ల చింతయ్య అన్నారు. గ్రామములో కుంటుబడ్డ అభివృద్ధి గురించి సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడానికి మండల పరిధిలోని రావులపల్లి గ్రామం నుండి సూర్యాపేటకు సోమవారం చింతయ్య పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత నాలుగు పర్యాయాలుగా ఈ తుంగతుర్తి నియోజకవర్గాన్ని పరిపాలించిన దళిత ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం మా గ్రామం విలువేయబడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం నుండి నేటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన మూడు ఎకరాల భూమి, దళిత బంధు, ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్ళు, ఇప్పటివరకు గ్రామంలో రాలేదని అన్నారు. నియోజకవర్గ ఏర్పడిన నాటినుండి గ్రామంలో సొంత అంగన్వాడి భవనం లేక అత్య భవనంలోనే కొనసాగుతుందని అన్నారు. గ్రామానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరైన వసతి లేక పక్క గ్రామీణ వెంపటి లో కొనసాగుతుందని అన్నారు. మా గ్రామంలో ఇప్పటివరకు కుల సంఘాల భవనాలు లేవు గ్రామానికి రావడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు,ఒక పశు వైద్యశాల లేదు, పూర్తిస్థాయిలో మురుగు కాలువలు లేక అవస్థలు పడుతున్నారని ఇవన్నీ స్థానిక నాయకులకు, పరిపాలిస్తున్న నాయకులకు కనబడటం లేదా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చినటువంటి ఇందిరమ్మ ఇండ్లలో సైతం నిజమైన అర్హులకు న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో పరిపాలకులు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా గ్రామానికి మంజూరైన 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని లేదంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. వీటన్నిటిపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు వినతి పత్రానికి ఇవ్వడానికి వెళుతున్న నాకు ఎక్కడికక్కడ స్థానికులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

# గురుకుల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది

- **గురుకుల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది**
- **ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్**



**జనగామ, ఆగస్టు 4(మనంప్రతినిధి):** ప్రభుత్వం గురుకులాల విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తుందని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అన్నారు. జనగామ పట్టణం లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో కలిసి సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ లు కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో భోజనశాలను సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. వంటగదిని సందర్శించి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల కొరకు తెప్పించిన వంట సామాగ్రి స్టాక్ రూమును సందర్శించి వస్తువుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ భోజనం చేస్తూ విద్యార్థులతో మాట్లాడారు.భోజనం బాగుంటుందా మెను ప్రకారంగా ఆహారం పెడుతున్నారా అని పలు ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ విద్యార్థులతో శ్రద్ధగా చదువుకోవాలని క్రమశిక్షణతో మెలగాలన్నారు.ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్నందున ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత చదువు లు అభ్యసించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, సివిల్ సప్లై డిటి లు శ్రీనివాస్, లచ్చు నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి




**రాయపర్తి, ఆగస్టు 4 (మనం న్యూస్):** మండలంలోని తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వర్లు గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా ఎస్ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ (బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు)పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబ స్వగృహాలకు వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 కేజీల బియ్యం ఆయిల్ క్యాన్ ను అందించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి యాకూబ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పిస్తూ 50 కేజీల బియ్యం ఆయిల్ క్యాన్ అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ ముఖ్య నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గజవెల్లి ప్రసాద్ ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతకుల మధుకర్ రెడ్డి,ఎండీ యూసఫ్, లేతకుల మహేందర్ రెడ్డి స్థానిక నాయకులు దోకుడు దేవేందర్, మాజీ సర్పంచ్ వశపాక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## లంచం అడిగితే 1064 కు కాల్ చేయండి




- **కార్యాలయాల్లో స్టిక్కర్లు అంటించిన ఏసీబీ అధికారులు**

**జనగామ, ఆగస్టు 4(మనం ప్రతినిధి):** అవినీతి అధికారుల భరతం పట్టేందు కు ఏసీబీ మరింత దూకుడును ప్రదర్శిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 పై ప్రచారానికి శ్రీకారం చుట్టింది. సోమవారం జనగామ జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో, ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో టోల్ ఫ్రీ నెంబర్కు సంబంధించిన స్టిక్కర్ల ను ఏసీబీ అధికారులు అంటించారు. ఈ స్టిక్కు ప్రభుత్వ కార్యాలయాల్లో మిమ్మల్ని ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, వేధించినా వెంటనే డయల్ 1064 అంటూ ఏసీబీ అధికారులు ముద్రించారు. ఈ నెంబరు ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఏసీబీ అధికారులు భరోసా ఇస్తున్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర**




**ములుగు, ఆగస్టు 4(మనం ప్రతినిధి):** స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానం లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్టేజి ఏర్పాట్లు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరిశీలించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు స్టాల్ లు ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసే ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన త్రాగునీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బంది అందరితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, , కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి**

**భూపాలపల్లి, మహదేవ పూర్, కాటారం మండలాల్లో పర్యటన**



**మహదేవపూర్, ఆగస్టు 4 (మనం న్యూస్):** సీజనల్ గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించడంతోపాటు వైద్య ఆరోగ్యశాఖ సమస్త సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని వైద్యారోగ్య శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యవేక్షణ అధికారి, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి ప్రధాన ఆసుపత్రిని, మహాదేవపూర్ లోని సామాజిక ఆరోగ్య కేంద్రంను, ఐ సి టి సి కేంద్రంను, కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొప్పారం సబ్ సెంటర్ లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి, ఐపీ కేసుల సంఖ్య ఎంత ఉందని, ఎలాంటి వ్యాధి బారిన పడిన ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మహాదేవపూర్ ఐసిటిసిని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఆన్ లైన్ నమోదు ప్రక్రియను, హెచ్ఐవి బాధితులకు అందుతున్న ఏ ఆర్ టీ మందులు మొదలగు వివరాలను ఐసిటిసి కౌన్సిలర్ గాదె రమేష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్ వార్డును తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య చికిత్సలను, కేస్ షీట్లను తెప్పించుకొని రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, ఇంచార్జీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, మహాదేవపూర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ విద్యావతి ఆర్ ఎం ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడు అమ్మ అశోక్



**పరకాల, ఆగస్టు 4 (మనం న్యూస్):** ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడిగా నిలుస్తూ 51 వ సారి రక్తదానం చేసి సామాజిక సేవకుడిగా అమ్మ అశోక్ నిలిచారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో రక్తం అత్యవసరం ఉందని అశోక్ ఫోన్ చేయగా స్పందించిన అశోక్ రక్తదానం చేయడం జరిగింది. ఒకటి కాదు, రెండు కాదు,ఏకంగా 51వ సార్లు రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచిన. శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన అమ్మ అశోక్ కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో 16సార్లు.బ్లడ్ బ్యాంక్ ఎంజీఎం హాస్పిటల్ వరంగల్ లో 9 సార్లు. మదర్ వాలంటరీ బ్లడ్ సెంటర్ 10 సార్లు పరకాల సి హెచ్ సి బ్లడ్ బ్యాంక్ లో 14సార్లు.జీవన్ బ్లడ్ బ్యాంకు హనుమకొండలో 2సార్లు రక్తదానం చేసాడు, ఒక్కసారి రక్తదానం చెయ్యాలంటేనే ఆలోచించే ఈరోజుల్లో 51 వ సార్లు రక్తదానం చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడు.అశోక్ ను పరకాల హాస్పిటల్ ఆర్ ఎం ఓ బాలకృష్ణ రమేష్ , కృష్ణ , ప్రశాంత్, రమేష్ తదితరులు అభినందించడం జరిగింది.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



**రాయపర్తి, ఆగస్టు 4 (మనం న్యూస్):** మండలంలోని బురాన్ పల్లి గ్రామానికి చెందిన బండ ఎల్లయ్య, కోలన్ పల్లి గ్రామానికి చెందిన గాజుల విజయ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బాధిత కుటుంబాల స్వగృహాలకు వెళ్లి చిత్రపటాలకు నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, బద్దం వేణుగోపాల్ రెడ్డి, గారె నర్సయ్య, చందు రాము,పోగులకొండ వేణు, సంకినేని ఎల్ల స్వామి, అశ్రఫ్ పాషా, ఉబ్బని సింహాద్రి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల




- **జిల్లా సహకార ఎన్నికల అధికారి ఏం. వాల్యా నాయక్ వెల్లడి**

**వరంగల్, ఆగస్టు 4 (మనంప్రతినిధి):** వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ షెడ్యూల్ను గత నెల 31న విడుదల చేసింది. ఈ మేరకు ఎన్నికల అధికారిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహకార అధికారి ఏం. వాల్యా నాయక్ ని నియమించగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ కాశిబుగ్గ బ్రాంచ్ నందు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ..... బ్యాంక్ పాలకవర్గంలో మొత్తం 12 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు. వారిలో ఎస్సీ ఎస్టీ కేటగిరీకి 1 స్థానం, మహిళా కేటగిరీకి 2 స్థానాలు, ఓపెన్ కేటగిరీకి 9 స్థానాలు రిజర్వ్ చేయబడ్డాయి. బ్యాలెట్ పేపర్ ముద్రణకు వివిధ రంగులను ఎస్సీ ఎస్టీ కేటగిరీకి లేత నీలం, మహిళా కేటగిరీకి లేత గులాబీ, ఓపెన్ కేటగిరీకి తెలుపు రంగు లు వాడబడతాయని ఎన్నికల ఆధికారి వాల్య నాయక్ తెలిపారు అంతే కాకుండా నామినేషన్లు స్వీకరించే తేదీ 2025 ఆగస్ట్ 8, 11,12 నామినేషన్లు అలాగే పరిశీలన 13 వ తేదీ ఉపసంహరణ14 వ తేదీన, ఎన్నికల గుర్తును కూడా 14 వ తేదీన సాయంత్రం బ్యాంకు ప్రధాన కార్యాలయం సిటీ రోడ్డు, కాశిబుగ్గ నందు తెలుపబడునని, 2025 ఆగస్టు 21 రోజున ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏవివి కళాశాల లో అదే రోజు సాయంత్రం కళాశాల ఆవరణలో ఓట్లు లెక్కించబడుతాయని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, నిష్పక్షపాతంగా తెలంగాణ సహకార సంఘాల చట్టము, నిబంధనలు 1964 ప్రకారం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అథారిటీ చే ఆమోదించబడ్డ బ్యాంక్ ఓటరు జాబితాలో పేర్లు నమోదైన సభ్యులు ఈ ఎన్నికల్లో చురుకుగా పాల్గొని, తమ ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసామని ఎన్నికల అధికారి విలేకరుల సమావేశంలో

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ. 51వేలు విరాళం



**చేవెళ్ల , ఆగస్టు 4(మనం న్యూస్ ):** చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సోమవారం ముడిమ్యాల పిఎసిఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా రూ.51వేలు విరాళంగా అందజేశారు. విగ్రహ నిర్మాణానికి సహకారం కావాలని కోరగానే వెంటనే స్పందించి ఆర్థిక సహకారాలు అందించిన గోనె ప్రతాప్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తంగడపల్లి గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు ప్రేమ్ కుమార్, జగన్నాథ్, జంగయ్య, విజయ్, పోచయ్య, గొంగుపల్లి రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలి

- **బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠినచర్యలు చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు, ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** బాలల హక్కుల పరిరక్షణ కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలని, బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠినచర్యలు చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆపరేషన్ ముస్కాన్ ముగింపు సమావేశం జిల్లా సంక్షేమ అధికారి తుల రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యం ఎంతో అమూల్యమైనది అని, అతి సున్నితమైన బాల్యానికి, వారి హక్కుల పరిరక్షణకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ -గీఐ భాగంగా సోషల్ డ్రైవ్ లో పాల్గొని 63 మంది చిన్నారులను రక్షించిన సిబ్బందిని అభినందించారు. వారందరినీ ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ వారి స్థితిగతుల ఆధారంగా వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠినచర్యలు చర్యలు తప్పవని, జిల్లాను బాలకార్మిక రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ వంతు పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న చిన్నారుల్లో ఒత్తిడిని నివారించేందుకు ప్రత్యేకంగా చేపట్టిన 'బాల్యం పై భరోసా' కార్యక్రమం సాగుతున్న తీరుతెన్నులను సంబంధిత టీం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలను సునిశితంగా పరిశీలించి అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, ఒత్తిడిలో ఉన్న చిన్నారులను గుర్తించి జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాల్లో ఉన్న వివిధ సమస్యలను కేటగిరీల వారీగా విభజించి నివేదికను రూపొందించి సమర్పించాలని సూచించారు. ముందుగా ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించినటువంటి జిల్లా సంక్షేమాధికారి తుల రవి స్వాగతోపన్యాసం చేస్తూ ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా పోలీస్, కార్మికశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగము చైల్ హెల్ప్ లైన్ విభాగాల క్షేత్ర స్థాయి సిబ్బంది జులై 1 నుండి జులై 31వరకు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారని అన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా నెల రోజుల పాటు వివిధ కేటగిరీలకు చెందిన 63 మంది చిన్నారులను సంరక్షించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ గా వ్యవహరించిన డీఎస్పీ కిషోర్ మాట్లాడుతూ, జిల్లాలో ములుగు ఏటూరునాగారం పోలీస్ సబ్ డివిజన్ల వారీగా ఈ స్పెషల్ డ్రైవ్ ను క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలు ఎంతో సమన్వయంతో నిర్వహించారని అన్నారు. ఫీల్ లో రెస్క్యూ చేసిన పిల్లలను పనిలో పెట్టుకున్నవారిపై చట్టపరంగా కేసులు పెట్టడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మికులు, ఒప్పంద బాల కార్మికులు, బడి బయటి బాలలు, బాల్య వివాహాలు, పోక్సో వంటి వివిధ కేటగిరీలకు చెందిన 63 మౌది బాల బాలికలను రక్షించడం




జరిగిందని తెలిపారు. ముఖ్యంగా బాల కార్మికులు గా గుర్తించిన 22 మంది పిల్లలకు సంబంధించి 15 మంది ఓనర్లపై సహాయ కార్మిక అధికారి గారి సమన్వయం తో కేసులు పెట్టి 15 ఎప్ఐఆర్,లు, కార్మిక శాఖ పరిధిలో 7 ఐఆర్ లు చేయడం జరిగిందని వివరించారు. ఈ 63 మంది చిన్నారుల విషయంలో బాలల న్యాయ చట్టం ను అనుసరించి తదుపరి ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ములుగు సహాయ కార్మిక అధికారి వినోద, ఏటూరునాగారం పోలీసు సబ్ డివిజన్ ల పరిధిలోని పోలీసు సిబ్బంది ఎస్సై ఇమ్మాన్యుయేల్ టీం, జిల్లా బాల పరిరక్షణ విభాగము పీవోలు కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, చైల్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ నరేష్, సఖి సీఏ లావణ్య, డిహెచ్ఈడబ్ల్యూ డీఎంసీ రమాదేవి ఆయా విభాగాల క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన సిరాజ్..



● కపిల్ దేవ్ రికార్డు బ్రేక్

ది ఓవల్ మైదానం వేదికగా ఇంగ్లండ్ తో జరిగిన ఐదో టెస్టులో టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ అసాధరణ ప్రదర్శన కనబరిచాడు. తన సంచలన బౌలింగ్ తో భారత్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్ సెకెండ్ ఇన్నింగ్స్ లో సిరాజ్ ఐదు వికెట్లతో చెలరేగాడు. మొత్తంగా 9 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ క్రమంలో సిరాజ్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

**సిరాజ్ సాధించిన రికార్డులు ఇవే..**

● ఐఇంగ్లండ్ గడ్డపై అత్యధిక టెస్టు వికెట్లు తీసిన మూడో భారత బౌలర్ గా సిరాజ్ నిలిచాడు. సిరాజ్ ఇప్పటివరకు ఇంగ్లండ్ లో 46 టెస్టు వికెట్లు సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ పేరిట ఉండేది. కపిల్ దేవ్ తన టెస్టు కెరీర్ లో ఇంగ్లండ్ గడ్డపై 43 వికెట్లు సాధించాడు. తాజా ఇన్నింగ్స్ లో స్మిత్ ను ఔట్ చేసి ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ రేర్ ఫీట్ సాధించిన జాబితాలో జస్ప్రీత్ బుమ్రా(51), ఇషాంత్ శర్మ(51) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

● ఐఅదేవిధంగా ఇంగ్లండ్ లో జరిగిన ఒక టెస్టు సిరీస్ లో భారత్ తరపున అత్యధిక వికెట్లు (23) తీసిన బౌలర్ గా బుమ్రా రికార్డును సిరాజ్ సమం చేశాడు. బుమ్రా 2021-22 పర్యటనలో ఇంగ్లండ్ పై 23 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్ లో సిరాజ్ మరో వికెట్ తీసి ఉంటే బుమ్రాను అధిగమించేవాడు.

● ఐవరల్ టెస్ట్ ఛాంపియన్ షిప్ హిస్టరీలో అత్యధిక సార్లు ఫైవ్ వికెట్ హాల్ సాధించిన నాలుగో బౌలర్ గా అక్షర్ పటేల్ రికార్డును సిరాజ్ సమం చేశాడు. అక్షర్ ఇప్పటివరకు 5 సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించగా.. సిరాజ్ కూడా సరిగ్గా ఐదు సార్లు ఈ ఫీట్ సాధించాడు.

డబ్ల్యూటీసీలో అత్యధిక త్యధిక సార్లు ఫైవ్ వికెట్ హాల్ సాధించిన బౌలర్ల జాబితాలో జస్ప్రీత్ బుమ్రా (12) అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత అశ్విన్ (11), రవీంద్ర జడేజా (6) జడేజా కొనసాగుతున్నారు.

ఇక ఈ సిరీస్ లో సిరాజ్(23 వికెట్లు) లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు.

## ఒంటిచేత్తో బ్యాటింగ్‌కు దిగిన వోక్స్

భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన ఐదో టెస్ట్ మ్యాచ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఎంట్రీకి వేదికైంది. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ ఆటగాడు క్రిస్ వోక్స్ భుజం విరిగినప్పటికీ ఒంటిచేత్తో బ్యాటింగ్ కు దిగి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆట చివరి రోజు ఇంగ్లండ్ గెలుపుకు 18 పరుగులు అవసరమైన దశలో వోక్స్ 11వ నంబర్ ఆటగాడిగా ఎంట్రీ ఇచ్చాడు. అతని ఎంట్రీ



సినిమా ఎలివేషన్ ను తలపించింది. వోక్స్ బ్యాటింగ్ చేయలేకపోయినా స్ట్రయిక్ రొటేట్ చేసి ఇంగ్లండ్ ను గెలిపించేందుకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ భారత్ చేతిలో 6 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. ఫలితంగా భారత్ ఐదు మ్యాచ్ ల సిరీస్ ను 2-2తో సమం చేసుకుంది. ఇదే సిరీస్ నాలుగో టెస్ట్ లో టీమిండియా ఆటగాడు రిషబ్ పంత్ కూడా పాదం ఫ్రాక్చర్ అయినప్పటికీ జట్టు ప్రయోజనాల కోసం బరిలోకి దిగి అందరి మన్ననలు అందుకున్నాడు. 1984లో విండీస్ ఆటగాడు మాల్కమ్ మార్షల్ కూడా వోక్స్ తరహాలోనే ఒంటిచేత్తో బ్యాటింగ్ కు దిగాడు. ఇంగ్లండ్ తో జరిగిన ఆ మ్యాచ్ లో మార్షల్ ఒంటిచేత్తో బౌండరీ బాదిన సన్నివేశాన్ని క్రికెట్ ప్రపంచం ఎన్నటికీ మరిచిపోదు.




## రాజాసాబ్ బ్యూటీ బర్త్ డే.. స్పెషల్ పోస్టర్ రిలీజ్

బ్యూటిఫుల్ హీరోయిన్ మాళవిక మోహనన్.. ప్రభాస్ 'రాజా సాబ్'తో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. ఆగస్టు 4 ఆమె పుట్టినరోజు సందర్భంగా మూవీ టీమ్ బర్త్ డే విషెస్ తో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్ లో చీరకట్టులో ట్రెడిషనల్ గా కనిపించి ఆకట్టుకుంటోంది మాళవిక. కొద్ది రోజుల క్రితం రిలీజ్ చేసిన 'రాజా సాబ్' టీజర్ లో మాళవిక అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ మూవీలో మాళవిక నటన, అందం ప్రత్యేక ఆకర్షణ కానుంది. 'రాజా సాబ్' లాంటి క్రేజీ మూవీతో తెలుగు ఆడియన్స్ కు పరిచయం కావడం ఎంతో స్పెషల్ గా భావిస్తోంది మాళవిక మోహనన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'రాజా సాబ్' చిత్రాన్ని డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## రాజమౌళి-మహేష్ సినిమాపై క్రేజీ అప్ డేట్?



దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఐతే, ఇప్పుడు ఈ సినిమా పై మరో క్రేజీ గాసిప్ వినిపిస్తోంది. అయితే, ఈ సినిమా ఇంటర్వెల్ సీక్వెన్స్ మొత్తం ఓ లోయలో జరుగుతుందని.. ముఖ్యంగా ఫారెస్ట్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయని తెలుస్తోంది. లోయ లోపల చేసే ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఓ రేంజ్ లో ఉంటుందట. అన్నట్టు ఈ సినిమాలో మహేష్ చేస్తున్న రోల్ లో చాలా వేరియేషన్స్ ఉంటాయట.

కాగా ఆ మధ్య విజయేంద్రప్రసాద్ ఈ సినిమా కథ గురించి ఓ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'నేను, రాజమౌళి ఇద్దరం దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ కు పెద్ద అభిమానులం. అందుకే ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ సినిమా స్క్రిప్ట్ ను రాశాను' అంటూ చెప్పుకొచ్చారు. కాబట్టి రాజమౌళి - మహేష్ సినిమా ఒక అడ్వెంచర్ థ్రిల్లర్ గా ఉండబోతుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.



## ఫిష్ వెంకట్ కుటుంబాన్ని పరామర్శించిన సోనూ సూద్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ అనారోగ్యంతో మరణించారు. కిడ్నీల సమస్యతో ఆస్పత్రిలో చేరిన ఫిష్ వెంకట్ కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. పూర్తి గా ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఫిష్ వెంకట్ మృతితో టాలీవుడ్ లో తీవ్ర విషాదం నెలకొంది. ఎంతో మంది ఆర్థికసాయం అందించినప్పటికీ అతని ప్రాణాలు కాపాడలేకపోయారు.

ఆ తర్వాత ఈ విషయం తెలుసుకున్న బాలీవుడ్ నటుడు సోనూ సూద్ సైతం ఫిష్ వెంకట్ కుటుంబానికి అండగా నిలిచారు. తన వంతు సాయంగా లక్షన్నర రూపాయలు వారి కుటుంబానికి అందజేశారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా ఫిష్ వెంకట్ కుటుంబాన్ని కలుస్తానని కూడా చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం తాజాగా ఇవాళ హైదరాబాద్ కు సోనూ సూద్ వచ్చారు. అనంతరం అడ్డగుట్టలోని ఫిష్ వెంకట్ నివాసానికి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కాగా.. జూనియర్ ఎన్టీఆర్ అదుర్స్ సినిమాతో ఫేమస్ అయిన ఫిష్ వెంకట్ పలు టాలీవుడ్ చిత్రాల్లో మెప్పించారు. ఆ తర్వాత గబ్బర్ సింగ్, ఖైదీ నంబర్ 150, శివం లాంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించారు. కమెడియన్ గా మాత్రమే కాదు విలన్ పాత్రల్లోనూ అభిమానులను మెప్పించారు. ఫిష్ వెంకట్ చివరిసారిగా కాఫీ విత్ ఎ కిల్లర్ లో కనిపించాడు.



## మొటిమలు పోవాలంటే.. తమన్నా చిట్కా

అందమైన ప్రేమరాణి లేత బుగ్గపై.. చిన్న మొటిమ కూడా ముత్యమేలే..' అని ఓ సినీ కవి గొప్పగా రాశారు. అయినప్పటికీ కేవలం మిల్లీమీటర్ ఉండే పింపుల్..! మన మనసంతా భారంగా మారుస్తుంది. ఆ మొటిమల వల్ల తమ అందం తరిగిపోతుందని ముఖ్యంగా యువత ఉక్కిరిబిక్కిరవుతుంది. అవి తగ్గడం కోసం వంటింటి చిట్కాలు, డెర్మటాలజిస్టు అపాయింట్ మెంట్లు, క్రీములు, సబ్బులు... ఇలా అన్ని విధాలా ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి వారికోసం మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా ఓ సహజ సిద్ధమైన చిట్కా గురించి ఇటీవల ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అయితే అది కాస్త అసాధారణంగా ఉండటంతో చర్చనీయంగా మారింది. ఆమె ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చర్మ సౌందర్యం గురించి మాట్లాడారు. మొటిమలకు ఉదయపు ఉమ్మి.. అద్భుతంగా పనిచేస్తుందన్నారు. 'ఉమ్మితో మొటిమలను నివారించుకోవచ్చు. అంటే.. ముఖ్యంగా ఉదయాన వచ్చే ఉమ్మితో పింపుల్స్ సమస్య నుంచి ఎంచక్కా బయటపడొచ్చు' అని చెప్పారు. అలాగే దీని వెనక ఓ సైంటిఫిక్ రీజన్ కూడా ఉందంటూ వివరించారు.

'దీని వెనక సైన్స్ ఉంది. ఎలా అంటే.. మనం ఉదయం నిద్ర లేవగానే మన నోట్లోని సలైవా(ఉమ్మి)లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అవి మొటిమలతో పోరాడతాయి. అయితే నేను డాక్టర్ ని కాదు. కానీ ఇది నా పర్సనల్ చిట్కా. మొటిమల విషయంలో ఇది వర్కౌట్ అవుతుందని నేను నమ్ముతున్నా. మనం నిద్రలేచేటప్పటికే మన శరీరం చాలా యాంటీ బ్యాక్టీరియల్ ఎలిమెంట్స్ ను నోట్లో తయారు చేసుకుంటుంది. మేల్కొన్న తర్వాత మన కంట్లో, ముక్కులోనూ మ్యూకస్ ఉంటుంది. అలాగే అప్పటికింకా మనం బ్రష్ చేసి ఉండం కాబట్టి.. మన నోరు చాలా రకాలైన బ్యాక్టీరియాతో యుద్ధం చేసి ఉంటుంది. మనం గనక ఆ ఉదయపు ఉమ్మిని మొటిమ మీద రాస్తే.. అది వెంటనే మానిపోయేలా చేస్తుంది' అని ఆమె వివరించారు.

అలాగే ఇతర చర్మ సంరక్షణ విధానాల గురించి కూడా ఆమె కొన్ని సూచనలు చేశారు. 'నేను 24, 25 ఏళ్ల వయసు నుంచే చర్మ సంరక్షణ కోసం శ్రద్ధ తీసుకుంటున్నాను. అలాగే వృద్ధాప్య ఛాయలను తగ్గించుకోవాలనుకుంటే.. 25 సంవత్సరాల వయసు నుంచే యాంటీ ఏజింగ్ క్రీమ్ లను ఉపయోగించడం మంచిది. ఆ ఏజ్ నుంచే ఇలా చేస్తే.. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది' అని ఆమె తన అభిమానులకు సలహా ఇచ్చారు. తమన్నా.. టాలీవుడ్ లో ఇటీవల 'ఓదెల 2'లో అఘోరీ పాత్రలో తన నటనతో మెప్పించారు. అలాగే బాలీవుడ్ లో 'రైడ్ 2'లో 'నషా' అనే సాంగ్ లో తళుక్కున మెరిశారు.

## టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్‌కు షాక్.. ఫిల్మ్ ఛాంబర్ సంచలన నిర్ణయం!

టాలీవుడ్ లో సినీ వర్కర్స్ వేతనాల పెంపు కోరుతూ బంద్ కు పిలుపునివ్వడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 30 శాతం వేతనాలు పెంచినవారి షూటింగ్ లకే హాజరవ్వాలని నిర్ణయించడంపై తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వేతనాల పెంపుపై ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియచేసిన తరువాత మాత్రమే విధులకు వెళ్లాలని నిర్ణయించడం చాలా బాధాకరమని పేర్కొంది. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు లేఖను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తెలుగు ఫిలిం చాంబర్ ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. నిర్మాతలు ఎవరైతే నైపుణ్యం కలిగిన పే వర్కర్స్ తామివ్వగలిగే వేతనానికి పనిచేస్తారో వాళ్లతో షూటింగ్స్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపింది. ఎంతోమంది ఔత్సాహిక నిపుణులు/కార్మికులు ఇండస్ట్రీలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. యూనియన్లలో సభ్యత్వం కొరకు లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తూ యూనియన్లు అవరోధం కలిగిస్తున్నాయని లేఖలో వివరించింది. ఇది నైపుణ్యవంతులైన కార్మికుల పొట్ట కొట్టడమేనని వెల్లడించింది. ప్రతి ప్రాజెక్టు అవసరాలు, వ్యక్తుల సామర్థ్యాల ఆధారంగా కార్మికులతో కలిసి పనిచేసే పూర్తి స్వేచ్ఛ నిర్మాతలకు ఉంటుందని తెలిపింది. ఎవరైనా ఔత్సాహిక నిపుణులు / కార్మికులు సినీ రంగంలో పనిచేయాలంటే వారితో పని చేయించుకోవడానికి నిర్మాతలందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారని స్పష్టం చేసింది. లక్షలాది రూపాయలు సభ్యత్వం కొరకు కట్టవలసిన పని లేదు.. నైపుణ్యం ఉన్న కార్మికునికి పని కల్పించడమే మా ధ్యేయమని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ లేఖ విడుదల చేసింది. మన ఫిలిం ఇండస్ట్రీ మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయమని కార్మిక సంఘాలు మరొక్కసారి గుర్తించాలని కోరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చిన్న నిర్మాతలు భరించలేని స్థాయిలో వేతనాలు పెంపును యూనియన్స్ డిమాండ్ చేయుటం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో 30 శాతం వేతనాల పెంపును నిర్మాతలందరూ వ్యతిరేకిస్తున్నట్లు లేఖలో పేర్కొంది. కనీస వేతనాల చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారని వెల్లడించింది. అంతేకాకుండా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసిందని వివరించింది. కాస్ట్ ఆఫ్ లివింగ్ విషయంలో మిగతా మెట్రోపాలిటన్ పట్టణాలతో పోలిస్తే మన హైదరాబాద్లో తక్కువని తెలిపింది. అయిన్పటికీ మనం అన్ని యూనియన్ల వారికి ఎక్కువ వేతనాలు చెల్లించడం జరుగుతోందని పేర్కొంది. ఇతర రాష్ట్రాల చలన చిత్ర పరిశ్రమలో ఇచ్చే వేతనాల కంటే మన తెలుగు రాష్ట్రాలలో పని చేసే కార్మికులకు అధిక వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించింది.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.